# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్
మంగళవారం
17-09-2024
వెల. రూ.5
• సంపుటి : 8 • సంచిక: 267
పేజీలు : 8

Hyderabad | Karimnagar | Nizamabad | Nallagonda | Mahaboobnagar | Warangal | Khammam | Amaravathi | Tirupathi | Kurnool | Eluru | Visakhapatnam | Ananthapuramu | Kadapa




## మహిళా సాధికారతే దేశానికి బలం

షీ శక్తి సమ్మిట్-2024లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

పితృస్వామిక దృక్పథాన్ని విడనాడాలి: సీజేఐ

7



## దేశాన్ని విభజించే కుట్ర

సమైక్యత, సమగ్రతలపై విష ప్రచారమే విద్వేషుల లక్ష్యం

21 శతాబ్దంలో ప్రపంచ దేశాల గమ్య స్థానం భారతే..

దేశంలో సౌర విప్లవం సువర్ణాధ్యాయం

ప్రధాని మోదీ వ్యాఖ్యలు

అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధన వనరుల పెట్టుబడిదారుల సదస్సు, రైళ్ల ప్రారంభోత్సవం

నమో భారత్ ర్యాపిడ్ రైళ్ల ప్రారంభం

తెలుగు రాష్ట్రాల వందే భారత్ రైళ్లకు శ్రీకారం

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

వివరాలు 7లో..



# గాంధీల గొప్పతనం గాడిదలకేం తెలుసు?





"ఎవడొస్తాడో రండిరా.. టైమ్ చెప్పండి.. ఎవడు వస్తాడో చూస్తా.. తెలంగాణ ఇచ్చింది మేము.. తెలంగాణ తెచ్చింది మేము? సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టేది మేము.."
- సీఎం రేవంత్

మీ ఫామ్‌హౌజుల్లో జిల్లేళ్లు మొలిపిస్తా

పదేళ్లపాటు తెలంగాణ తల్లి విగ్రహం ఎందుకు పెట్టలే

సచివాలయం ముందు కేసీఆర్ విగ్రహం పెట్టాలని చూశారు

రాజీవ్ లేకుంటే దేశంలో ఐటి ఎక్కడుండేది

పదేళ్లపాటు కుటుంబ పాలన చేసి.. గాంధీలపై విమర్శలా

రాజీవ్ విగ్రహాన్ని తొలగించే దమ్ముందా?

రాజీవ్ విగ్రహావిష్కరణ సభలో కేసీఆర్ కుటుంబంపై సీఎం రేవంత్ ఫైర్

వివరాలు 2లో..



## భక్త గణ యాత్ర

నేడు మహా నిమజ్జనం

దివ్య మంగళ రూపాలను కనులారా వీక్షించే అద్భుత ఘట్టం

గణనాథుడికి ఘనమైన వీడ్కోలుకు సిద్ధమైన భాగ్యనగరం

శోభాయాత్ర సజావుగా సాగేలా ప్రభుత్వం చర్యలు

మధ్యాహ్నం 1.30 గంటల్లోపే ఖైరతాబాద్ గణపతి నిమజ్జనం

వినాయక ప్రతిమల నిమజ్జనానికి 468 క్రేన్లు

నిమజ్జన ఘట్టంలో 15వేల మంది బల్దియా సిబ్బంది

122 వాటర్ క్యాంపులు.. 35 లక్షల వాటర్ ప్యాకెట్లు

నెక్లెస్‌రోడ్‌లో ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

వివరాలు 4లో..



21న సీతారాం ఏచూరి

## సంస్మరణ సభ

సీఎం రేవంత్, తదితరుల హాజరు

వివరాలు 2లో..



## నేడు, రేపు వైన్స్ బంద్

సీపీ ఆనంద్ ఉత్తర్వులు జారీ

వివరాలు 2లో..

# నిమజ్జనంలో ఇబ్బందులుండొద్దు

ట్యాంక్ బండ్‌తో పాటు ప్రధాన మండపాల వద్ద దృష్టి

చెరువుల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ ఉండాల్సిందే

బ్లైండ్ స్పాట్స్, హాట్ స్పాట్లకు సంబంధించి రికార్డు ఫాలో

నిమజ్జనంపై సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్ సూచన



హైదరాబాద్, సెప్టెంబర్ 16 (మనం న్యూస్): ట్యాంక్ బండ్‌తో పాటు ప్రధాన మండపాలు, చెరువుల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. పర్యవేక్షణతో పాటు ప్రతీ గంటకు ఒకసారి సిబ్బందికి కమాండ్ కంట్రోల్ నుంచి సూచనలు ఇచ్చి అలెర్ట్ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ఎక్కువ దృష్టి మిగతా 2లో...

పేరు మార్చి తెలంగాణ చరిత్రనే

# కనుమరుగు చేస్తున్నరు




బీజేపీ అధికారంలోకి వస్తే సర్దార్ పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం

6 గ్యారంటీలపై డైవర్ట్ చేసేందుకు రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకోవాలని విజ్ఞప్తి

5



## తెలంగాణ తల్లి విగ్రహాలకు నేడు పాలాభిషేకం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

## 40వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యం



2035 నాటికి చేరుకోవాలన్న పట్టుదల

గ్రీన్ పవర్ పెట్టుబడిదారుల సభలో భట్టి విక్రమార్క

గాంధీనగర్/హైదరాబాద్, సెప్టెంబరు 16 (మనం న్యూస్): తెలంగాణలో 2035 నాటికి అదనంగా 40వేల మెగావాట్ల(40గిగావాట్లు) గ్రీన్ పవర్(సౌర, పవన, జల విద్యుత్)ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. గుజరాత్ గాంధీనగర్‌లో సోమవారం జరిగిన 'ప్రపంచ పునరుత్పాదక ఇంధన వనరుల పెట్టుబడిదారుల' 4వ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి రాష్ట్రంలో చాలా అనుకూలత ఉందని చెప్పారు. ఏడాదిలో 300 రోజుల పాటు మిగతా 2లో...



## 'వందే భారత్'కు స్వాగతం

నాగపూర్ నుంచి సికింద్రాబాద్ చేరిన రైలు

పాల్గొన్న గవర్నర్, కిషన్‌రెడ్డి, కోమటిరెడ్డి

2

అక్టోబర్‌లో అర్హులందరికీ

# రేషన్ కార్డులు

విధివిధానాలు ఖరారు చేస్తున్న కేబినెట్ కమిటీ


ప్రతి ఒక్కరికీ రేషన్, హెల్త్ కార్డులు మంజూరు చేస్తాం

వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్



హైదరాబాద్, సెప్టెంబర్ 16 (మనం న్యూస్): రేషన్ కార్డులు, హెల్త్ కార్డులపై ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. అక్టోబర్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్, హెల్త్ కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించింది. సోమవారం కేబినెట్ సబ్ కమిటీ భేటీ జరిగింది. అనంతరం మంత్రి ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేబినెట్ సబ్ కమిటీ భేటీలో చర్చించిన విషయాలను మీడియాకు మిగతా 2లో...

# గాంధీల గొప్పతనం గాడిదలకేం తెలుసు?



### పంచాయతీలకు నేరుగా నిధులిచ్చింది రాజీవ్

'దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని, సమూలమైన మార్పులు రావాలని భావించి ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించింది రాజీవ్ కాదా? అని ఈ సన్నాసులు, సోయి లేనోళ్లను అడగదల్చుకున్నా. ఢిల్లీ నుంచి గ్రామ పంచాయతీలకే నేరుగా నిధులు వెళ్లేలా రాజ్యాంగ సవరణలు చేసింది రాజీవ్ కాదా? మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చిన ఘనత ఆయనది కాదా? అని ఈ సన్నాసులకు గుర్తు చేయదల్చుకున్నా. ఐదేళ్లు ఒక మహిళకు మంత్రి పదవి కూడా ఇవ్వని సన్నాసులకు మహిళా గౌరవం ఎలా తెలుస్తుంది?'' అని రేవంత్ అన్నారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** సచివాలయం ఎదుట సీఎం రేవంత్ రెడ్డి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి సుదీర్ఘంగా విమర్శలు చేశారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అని.. రాష్ట్రాన్ని కాపాడేది కూడా తామే అని రేవంత్ చెప్పారు. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే.. దాన్ని తీసేస్తామని బీఆర్ఎస్ నేతలు అనడంపై రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లుగా తెలంగాణ తల్లి విగ్రహం పెట్టకుండా పామ్‌హౌజ్‌లు, ప్రగతిభవన్‌లు, కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టులు కట్టుకున్నారని మండిపడ్డారు. అలాంటి వారు ఇవాళ తెలంగాణ తల్లి గురించి మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. ఆ గాడిదలకు బుద్ధి లేదు.. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ముట్టి చూడండి బిడ్డా.. ఎవడు వస్తాడో రండి.. నేను చూస్తా. రాజీవ్ గాంధీ విగ్రహం సాక్షిగా నేను ప్రతిజ్ఞ చేస్తున్నా. తెలంగాణ తల్లి విగ్రహాన్ని దేశం అబ్బురపడే రీతిలో మేం ప్రతిష్ఠ చేస్తాం. డిసెంబర్9న తెలంగాణ ప్రకటన వచ్చిన రోజుకు గుర్తుగా సచివాలయంలో ప్రతిష్టామని అన్నారు. అలాగే కొండా లక్ష్మణ్ బాపూజీ లాంటి మహనీయులకి విలువ ఇవ్వని సన్నాసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. కేసీఆర్, ఆయన కొడుకు కేటీఆర్ తెగించి దోచుకున్నారు. ఆ కాలకేయ ముఠా, మీడతల దండు నుంచి తెలంగాణను కాపాడుకుందాం అని రేవంత్ సంచలనంగా విమర్శలు చేశారు. కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు లక్ష్యంగా రేవంత్ రెడ్డి తీవ్రంగా, ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. ట్విటర్ పిట్ట అయిన కేటీఆర్ కు కంప్యూటర్ తెచ్చిందే రాజీవ్ గాంధీ కదా. లేకపోతే గుంటూరులో ఇడ్లీ, వడ అమ్ముకునే వాడు. కేటీఆర్ ఐటీ శాఖ మంత్రి అయ్యాడు అంటే అది రాజీవ్‌గాంధీ చలవే. పదవులు, ప్రాణత్యాగం అంటే గాంధీ కుటుంబం మాత్రమే గుర్తుకు వస్తుంది. కేటీఆర్ అయ్య ముఖ్యమంత్రి.. కేసీఆర్ కొడుకు మంత్రి.. అల్లుడు హరీశ్ రావు ఇరిగేషన్ మంత్రి, ఒకరు రాజ్యసభ, మరొకరు ఎమ్మెల్సీ. ఇలా కటుఉంబ పాలన చేసిన వారు గాంధీ కుటుంబ పాలన గురించా మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. కేసీఆర్ వేల ఎకరాల్లో ఫామ్ హౌస్ కట్టిండు. అలాంటిది తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడానికి పదేళ్లు సరిపోలేదా? మీ ఫామ్ హౌస్‌లలో జిల్లేడు మొలిపిస్తా.. అలాగే తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం లోపల పెట్టిస్తున్నం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. అలాగే చాకలి ఐలమ్మ పేరుతో మహిళా యూనివర్సిటీ, సురవరం ప్రతాపరెడ్డి పేరుతో తెలుగు వర్సిటీకి పేరు పెట్టుకోబోతున్నామని అన్నారు. ఐదేళ్లు మహిళకు మంత్రి వర్గంలో చోటు ఇవ్వని సన్నాసులకు మహిళా అభివృద్ధి గురించి ఏం తెలుస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. రాజీవ్ గాంధీ తెచ్చిన కంప్యూటర్ పరిజ్ఞానంతోనే అమెరికా వెళ్లి జాబ్ చేశావు.. ఐటీ మంత్రి అయ్యావ్, లేకపోతే కేటీఆర్ మంత్రి దరిద్రం ఉండేది కాదు అని విమర్శించారు. లేకపోతే గుంటూరులో చాయ్, టిఫిన్స్ అమ్ముకుంటూ ఉండేవాడివి.. సిద్ధిపేటలో ఛాయ్ అమ్ముకుంటూ ఉండేటోడివి అంటూ ఎద్దేవా చేశారు. ఎంత బలుపు మాటలు.. అధికారం పోయిన మదం తగ్గలేదని కేటీఆర్ పై ధ్వజమెత్తారు. త్యాగాలు అంటే నెహ్రూ, ఇందిరమ్మ, రాజీవ్ కుటుంబాలవేనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గాడిదలకు ఏం తెలుసు గంధపు చెక్కల వాసన అని దుయ్యబట్టారు. మీ ఫామ్ హౌజ్‌లలో జిలలెళ్లు మొలిపిస్తానని చురకలు అంటించారు. రాజీవ్ గాంధీ విగ్రహం సాక్షిగా కాంగ్రెస్ కార్యకర్తలకు చెబుతున్నా.. వెయ్యి ఎకరాల్లో తండ్రి ఫామ్ హౌజ్ కట్టించుకున్నాడు.. కొడుకు వంద ఎకరాల్లో జన్వాడలో ఫామ్ హౌజ్ కట్టించుకున్నాడని అన్నారు. సొంత విగ్రహం పెట్టుకునేందుకు సెక్రటేరియట్ ముందు స్థలాన్ని పెట్టుకున్నాడు అని తెలిపారు. 'ఎవడొస్తాడో రండిరా.. టైమ్ చెప్పండి.. ఎవడు వస్తాడో చూస్తా.. తెలంగాణ ఇచ్చింది మేము.. తెలంగాణ తెచ్చింది మేము? సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టేది మేము..' అని అన్నారు. బీఆర్ఎస్ ఏర్పాటుకు స్థలాన్ని ఇచ్చిన కొండా లక్ష్మణ్ బాపూజీ చనిపోతే కేసీఆర్ కుటుంబం ఒక్కరు కూడా హాజరు కాలేదని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్‌కు రెగ్యులర్‌గా షాక్ ట్రీట్మెంట్ జరుగుతుంది.. అర్థం కావడానికి కొంత సమయం పడుతుందని విమర్శించారు. కాలకేయ ముఠా గ్రామాల మీద పడుతుంది.. కొంతమంది మిడతల దండును మన ప్రజల మీదకు ఉసి గొల్పుతున్నరు.. కాంగ్రెస్ కార్యకర్తలు ఆ మిడతల దండును తరిమికొట్టాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ ప్రజల కోసమే రాజీవ్ గాంధీ ప్రధాని పదవి చేపట్టారని, ప్రజలకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి గ్రామాలే పట్టుకొమ్మలని మహాత్మా గాంధీ అన్నారు. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన నేత రాజీవ్ గాంధీ. 72,73వ రాజ్యాంగ సవరణ ద్వారా నేరుగా గ్రామాలకు నిధులు కేటాయించారు. ఆడబిడ్డలకు రాజ్యాధికారం ఇచ్చారు. ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేశారు త్యాగం అంటే ఏంటో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తనపై ఉంది. రూ.వేల కోట్ల సంపదను దేశం కోసం త్యాగం చేసిన నాయకుడు, స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్లిన వ్యక్తి, స్వాతంత్ర్యం తర్వాత దేశాన్ని ఐక్యంగా ఉంచిన నేత నెహ్రూ. ఆయన కట్టిన ప్రాజెక్టులు ఇప్పటికీ ఆయన పనితనానికి సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయి. నెహ్రూ అధికారంలో ఉన్నప్పుడు ఇందిరా గాంధీ ఏ బాధ్యతా తీసుకోలేదు. కొందరు మాత్రం తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని మంత్రి పదువులు పొందుతున్నారు. బ్యాంకులను ప్రభుత్వపరం చేసి పేదలకు ఇందిరా గాంధీ మంచి చేశారు. లక్షల ఎకరాల భూములను పేదలకు పంచి పెట్టింది ఇందిరా గాంధీ కాదా? దేశంలో రిజర్వేషన్లు తెచ్చింది కాంగ్రెస్ పార్టీ కాదా?'అని అన్నారు. రాజీవ్ గాంధీ తర్వాత సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఏ పదవీ తీసుకోలేదు. పదవి త్యాగం అంటే వాళ్లవి. తెలంగాణ బిడ్డ పీవీని ప్రధానిని చేసింది సోనియా గాంధీ కాదా? గాంధీ కుటుంబం గురించి కేసీఆర్ కుటుంబానికి తెలుసా? అడ్డగోలుగా మాట్లాడితే చూస్తూ ఊరుకుంటామనుకున్నారా? గత పాలకులు సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం పెడదామనుకున్నారట. పదేళ్లలో ఎందుకు పెట్టలేదు?'అని సీఎం ప్రశ్నించారు. డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని



ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, సీతక్క, కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపా దాస్‌మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు హాజరయ్యారు.

ఆగస్ట్ 20న రాజీవ్‌గాంధీ జయంతి రోజున సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో విగ్రహాన్ని ఆవిష్కరింప జేయాలని ప్రభుత్వం భావించింది. కానీ.. కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. సచివాలయానికి ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఆ స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని గత ప్రభుత్వం భావించింది. అయితే, తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సింది సెక్రటేరియెట్ బయట కాదని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. సచివాలయం లోపల ప్రధాన ద్వారం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు ఇటీవలి భూమి పూజ కూడా చేశారు. డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని ప్రకటించారు. ఒకవైపు దేశానికి ప్రధానులుగా పనిచేసిన ఇందిరా గాంధీ, పీవీ విగ్రహాలు వరుసగా ఉండటంతో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని అటు అమరవీరుల చిహ్నం, సెక్రటేరియెట్ మధ్యలో ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.


### ఇంతటి దుర్మార్గుడు, నీచుడు భూమ్మీద ఉంటాడా? : సీఎం

'ఇక్కడే కొండా లక్ష్మణ్ బాపూజీ కేసీఆర్‌కు పార్టీ పెట్టుకోమని ఇల్లు ఇచ్చిండు. అది కూలిపోతే, నిలువ నీడ లేకపోతే, కొండా లక్ష్మణ్ బాపూజీ చనిపోతే.. కనీసం ఆఖరి చూపులకు పోలేదు. ఇంతకంటే దుర్మార్గుడు, నీచుడు భూమ్మీద ఎవడైనా ఉంటాడా?'' అని కేసీఆర్ను ఉద్దేశించి సీఎం రేవంత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'అలాంటి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్‌కు పెట్టాం. మహిళా యూనివర్సిటీకి వీర నారి చాకలి ఐలమ్మ పేరు పెట్టినం. సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును తెలుగు యూనివర్సిటీకి పెట్టుకుంటున్నం. పదేళ్లలో ఇలాంటి గొప్ప వ్యక్తుల పేర్లు పెడతామంటే వద్దన్నారా? అన్నింటికీ నువ్వు, నీ కుటుంబమే కనబడాలి. తెలంగాణ మొత్తాన్ని దిగమింగాలన్న ఆలోచన మీ కుటుంబానిది. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బండకేసి కొడతారని వాళ్లు ఊహించలేదు. ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు. ఫాంహౌస్లో ఆయనకు షాక్ ట్రీట్మెంట్స్ జరుగుతున్నాయి. కొంత మంది చిల్లరమల్లరగాళ్లతో మన గురించి మాట్లాడిస్తున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలారా జాగ్రత్తగా ఉండండి'' అని రేవంత్ అన్నారు.

### కేటీఆర్ క్షమాపణ చెప్పాలి: కోమటిరెడ్డి

రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుపై అడ్డగోలుగా మాట్లాడిన బీఆర్ఎస్ నేత కేటీఆర్ క్షమాపణ చెప్పాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి డిమాండ్ చేశారు. రాజీవ్‌గాంధీ దేశ ఐక్యత కోసం ప్రాణాలు అర్పించారన్నారు. అలాంటి కుటుంబం గురించి పనికిరానివాళ్లు, తెలంగాణ కోసం దొంగ నాటకాలు వేసినవారు మాట్లాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్ మానసిక పరిస్థితిపై అనుమానంగా ఉందన్నారు.

# నిమజ్జనంలో ఇబ్బందులుండొద్దు



మొదటి పేజీతరువాయి...

పెట్టాలని అన్నారు. బ్లైండ్ స్పాట్స్, హాట్ స్పాట్లకు సంబంధించి రికార్డు మెయింటనెన్స్ చేయాలని ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గణేశ్ నిమమజ్జనం ఏర్పాట్లు, పర్యవేక్షణపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా 733 సీసీ కెమెరాలతో నిమజ్జన ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డికు సీపీ ఆనంద్ వివరించారు. హుస్సేన్ సాగర్ వద్ద నిమజ్జనాల కోలాహలం నెలకొంది. నెలకెస్ రోడ్ వద్ద నిమజ్జనానికి గణనాథులు బారులు తీరారు. పీపుల్స్ ఎలాజా వద్ద నిమజ్జనాలు ఆలస్యంగా జరుగుతున్నాయి. పీపుల్స్ ఎలాజా వద్ద ఆరు క్రేన్లను మాత్రమే ఏర్పాటు చేయడంతో ఆలస్యంగా నిమజ్జనాలు జరుగుతున్నాయి. ఒక్కొక్క విగ్రహం నిమజ్జనానికి మూడు గంటలకు పైగా సమయం పడుతోంది. కాగా మహా నిమజ్జనానికి జీహెచ్ఎంసీ తరఫున ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 160 గణేశ్ టీమ్స్ పని చేస్తున్నాయి. నిమజ్జనానికి మొత్తం 15 వేల మంది సిబ్బంది పని చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా నిమజ్జనానికి 10 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. నిమజ్జనం మరుసటి రోజు అదనంగా మరో 500 మంది సిబ్బంది పని చేయనున్నారు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా 73 వినాయక పాండ్స్, పెద్ద చెరువుల్లో జీహెచ్ఎంసీ నిమజ్జన ఏర్పాట్లు చేసింది. జీహెచ్ఎంసీ పరిధిలో 468 క్రేన్లు. హుస్సేన్ సాగర్ చుట్టూ 32 క్రేన్లు ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. రేపటి నుంచి మూడు రోజులపాటు జీహెచ్ఎంసీ సిబ్బందికి సెలవులు రద్దు చేశారు.

### నేడు, రేపు వైన్స్ బంద్

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** మందుబాబులకు చేదువార్త. సెప్టెంబర్ 17, 18 తేదీల్లో వైన్స్ బంద్ చెయ్యాలని సీపీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేసారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి బుధవారం సాయంత్రం 6 గంటల వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల పరిధిలో అన్ని రకాల మద్యం షాపులను(వైన్స్, కల్లు దుకాణాలు, బార్లు, బార్ అండ్ రెస్టారెంట్లు) మూసేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు, లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌ల అదనపు ఇన్‌స్పెక్టర్‌లకు అధికారం ఇవ్వనున్నారు. అయితే స్టార్ హోటల్ బార్‌లు, రిజిస్టర్ క్లబ్‌లకు ఈ ఆదేశాలు వర్తించవని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### 40వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యం

మొదటి పేజీతరువాయి...

సౌరవిద్యుత్ ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంటుందని, సోలార్ విద్యుత్కు సంబంధించి రాష్ట్రంలో 26.4 గిగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లను ఏర్పా టు చేయడానికి అవకాశాలున్నాయని చెప్పారు. దేశంలో బలంగా గాలులు వీచే తొలి 8 రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని, 150 మీటర్ల ఎత్తుతో 5.4 గిగావాట్ల సామర్థ్యం కలిగిన పవన విద్యుత్ ప్లాంట్లు పెట్టడానికి తెలంగాణలో అనుకూల పరిస్థితులు ఉన్నాయన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్లతో పాటు బొగ్గు నిల్వలు అంతరించిపోయిన ఓపెన్‌కాస్టు గనుల్లో కూడా పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లు పెట్టి జలవిద్యుత్ ఉత్పత్తి చేయడానికి వీలుందన్నారు. వీటితోపాటు గ్రీన్ హైడ్రోజన్, జియో థర్మల్ అన్నీ కలిపి మొత్తం గా 40వేల మెగావాట్ల గ్రీన్ పవర్ను ఉత్పత్తి చేయడానికి వనరులున్నాయని వివరించారు. గ్రీన్ పవర్ ఉత్పత్తికి సంబంధించిన ప్రణాళికను కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి అందించారు. రాబోయే రోజుల్లో ఏఐ సిటీ, ఫోర్త్ సిటీతో పాటు మూసీ రివర్ఫ్రంట్ డెవలప్‌మెంట్‌తో తెలంగాణ ముఖచిత్రమే మారనుందన్నారు. ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)తో కీలక పారిశ్రామిక కారిడార్లను అనుసంధానం చేస్తామన్నారు. పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. భారతదేశం 2030కల్లా 500 గిగా వాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్న విషయాన్ని భట్టి గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, గోవా, రాజస్థాన్ సీఎంలు హాజరయ్యారు. అనంతరం సోలార్ రంగంలో పెట్టుబడుల కోసం దాదాపు 40 మంది పారిశ్రామిక వేత్తలతో భట్టి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆయన వెంట ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

### 21న సీతారాం ఏచూరి సంస్మరణ సభ

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** సీపీఐ (ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి.. సంస్యరణసభను 21న నగరంలో ఏర్పాటు చేయబోతున్నారు. ఏచూరి ఈ నెల 12న అనారోగ్యంతో ఢిల్లీ ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే.. ఆయన మరణం జాతీయ, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాలకు, ప్రత్యేకంగా తెలుగురాష్ట్రాలకు తీరని లోటు అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21న హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'సీతారాం ఏచూరి సంస్మరణ సభ' ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామని తమ్మినేని వీరభద్రం చెప్పారు. ఈ సభలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పీసీసీ అధ్యక్షులు బి. మహేష్‌కుమార్ గౌడ్, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ కోదండరాంతో పాటు ఇతర వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు పాల్గొని ప్రసంగించనున్నట్లు తమ్మినేని తెలిపారు. ఈ సంస్మరణ సభను జయప్రదం చేయాలని ప్రజలకు, ప్రజాతంత్రవాదులకు, వామపక్ష మేధావులకు సీపీఐ(ఎం) విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

### ప్రపంచ ఫార్మా బ్రాండ్‌గా హైదరాబాద్

#### జీనోమ్ వ్యాలీలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** హైదరాబాద్ బ్రాండ్‌ను ప్రపంచంలోనే ఒక ఫార్మా కంపెనీల బ్రాండ్‌గా తీర్చిదిద్దుతామని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జినోమ్ వ్యాలీలోని పరిశ్రమల ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 30,40 ఏళ్లుగా కృషి చేస్తున్న ఫార్మా పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం, సకల వసతులు కల్పిస్తూ మరిన్ని పెట్టుబడులు వచ్చే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కృషి చేస్తున్నామని చెప్పారు. సోమవారం లారస్ ల్యాబ్స్, కర్క ల్యాబ్స్ సుమారు 300 ఎకరాల్లో రూ.2వేల కోట్లతో వందల మందికి ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలను ప్రారంభించాయన్నారు. ప్రపంచ ఫార్మా దృష్టిని ఆకర్షించేందుకు జినోమ్ వ్యాలీని ప్రపంచస్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఫార్మా రంగంలో పెట్టుబడులకు స్వర్గధామంలా తయారు చేసి ఉపాధి అవకాశాలు, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అందుకే, ఫార్మా కంపెనీల దిగ్గజాలతో మరిన్ని పెట్టుబడులు రాబట్టే విషయమై చర్చించామన్నారు. ఈ సమావేశంలో టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మలా జయప్రకాశ్‌రెడ్డి, ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు, పలు ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### అక్టోబర్‌లో అర్హులందరికీ రేషన్ కార్డులు

మొదటి పేజీతరువాయి...

వెల్లడించారు. కొత్త రేషన్ కార్డు విధివిధానాలు రూపొందిస్తున్నామని మంత్రి ఉత్తమ్ చెప్పారు. తెల్ల రేషన్ కార్డు అర్హులు ఎవరనేదానిపై వచ్చే భేటీలో నిర్ణయిస్తామన్నారు. ఇతర రాష్ట్రాల్లో రేషన్ కార్డులు ఎలా ఇస్తున్నారనేదానిపై అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డుల నిబంధనలు ఎలా ఉండాలని పార్టీలకు లేఖ రాశామన్నారు.. కొంత మంది ప్రజాప్రతినిధులు విలువైన సూచనలు చేశారు. వచ్చిన సూచనలన్నీ సమావేశంలో చర్చించామని తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. అందరికి ఆరు కిలోల బియ్యం ఉచితంగా ఇస్తామన్నారు. గత ప్రభుత్వం 49 వేల రేషన్ కార్డులు మాత్రమే ఇచ్చింది..అవి కూడా బై ఎలక్షన్ వచ్చిన నియోజకవర్గాల్లోనే రేషన్ కార్డులు ఇచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్రమంతా ఏ నాడు రేషన్ కార్డులు ఇవ్వలేదు . మేం పారదర్శకంగా రేషన్ కార్డులు జారీ చేస్తాం. సెప్టెంబర్ 21 నమరోసారి కేబినెట్ సబ్ కమిటీ భేటీ ఉంటుంది. ఈ నెలాఖరులోగా కేబినెట్ కమిటి రిపోర్ట్ ఇస్తుంది. అక్టోబర్ లో అర్హులైన అందరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తామని మంత్రులు వెల్లడించారు.

### తెలంగాణ తల్లి విగ్రహాలకు నేడు పాలాభిషకేం

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించడానికి వ్యతిరేకంగా నేడు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకాలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. తెలంగాణలోని అన్ని నియోజకవర్గాల్లో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ తల్లి కోసం కేటాయించిన స్థానంలో కేవలం రాజకీయ దురుద్దేశంతో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టి, తెలంగాణ తల్లిని అవమాన పరిచిన రేవంత్ రెడ్డి వైఖరిని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజలు బుద్ధి చెబుతారు. తెలంగాణ అస్తిత్వంతో పెట్టుకున్నోళ్లెవరూ రాజకీయాల్లో బతికి బట్టకట్టలేరన్న విషయం రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పేర్కొంది.

# ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలి

- వినాయకుని ఆశీర్వాదంతో ముందుకు సాగాలి
- గణేష్ నిమజ్జనం ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలి
- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్లగొండ,సెప్టెంబర్ 16( మనం ప్రతినిధి) :** నల్గొండ జిల్లాలో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రెడ్డి పిలుపునిచ్చారు. మతం కన్నా మానవత్వం ముఖ్యమని ఆయన అన్నారు. నల్గొండ జిల్లా మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిందని, గడచిన 30 సంవత్సరాలలో జిల్లాలో ఎలాంటి చిన్న సంఘటనలు సైతం చోటు చేసుకోలేదని తెలిపారు. గతంలో లాగే ఈ సంవత్సరం సైతం వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన గణేష్ ఉత్సవ కమిటీలకు, యువతకు పిలుపునిచ్చారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని హనుమాన్ నగర్ ఒకటవ వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గణేష్ శోభాయాత్రను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గణేష్ శోభాయాత్రను జిల్లా అంతట సంతోషంగా జరుపుకోవాలని, ఎలాంటి విఘ్నాలకు తావు లేకుండా నిమజ్జనం చేయాలని అన్నారు . ప్రతి ఒక్కరు మతం కన్నా మానవత్వంతో పనిచేయాలని, పేదలను ఆదుకోవడమే మన ఆశయం కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో అన్ని మతాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇందులో భాగంగా ఇదివరకే ఈద్గాను అభివృద్ధి చేశామని, భవిష్యత్తులో ఇంకా అభివృద్ధి చేస్తామని, అలాగే ఆంజనేయ స్వామి దేవాలయాన్ని సైతం అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. నల్గొండ జిల్లాను రాష్ట్రంలోనే మోడల్ జిల్లాగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తున్నానని, ముఖ్యంగా 2000 కోట్ల రూపాయలతో హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి 6 లైన్ల విస్తరణ పనులకు త్వరలోనే కేంద్ర మంత్రి గడ్కరితో శంకుస్థాపన చేయించనున్నామని, 450 కోట్ల రూపాయలతో నల్గొండ పట్టణంలో రోడ్లు, డ్రైన్ల వంటి పనులు జరుగుతున్నాయని ,పది లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన 10 తాగు నీటి ట్యాంకులు, 15 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన 5 తాగునీటి ట్యాంకులు స్లాబ్ దశకు చేరుకున్నాయని ,త్వరలోనే పనులు పూర్తయితాయని చెప్పారు. 2 సంవత్సరాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ తో పాటు, సిసి రోడ్లను పూర్తి చేస్తామన్నారు .పేదలకు ఇండ్లు నిర్మించి ఇచ్చేందుకుగాను హౌసింగ్ బోర్డ్ కి చెందిన 50 ఎకరాల స్థలాన్ని సేకరించడం జరిగిందని ,మరో 25 ఎకరాలలో 80 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ పనులు త్వరలోనే ప్రారంభించనున్నామని తెలిపారు.జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ గణేష్ నిమజ్జనాన్ని శాంతియుతంగా జరుపుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, అందరినీ కలుపుకుని నిమజ్జనాన్ని శాంతియుతంగా జరపాలన్నారు. అంతేకాక జిల్లా వ్యాప్తంగా నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఆయన ఉత్సవ కమిటీలకు అలాగే అధికారులు, యువతకు సూచించారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ,అలాగే గణేష్ విగ్రహాల నిమజ్జనం జరిగే చోట ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉందని, అక్కడ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు 600 మంది పోలీసులు ,అధికారులు, సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నామని, సీసీ కెమెరాలతో పాటు, డ్రోన్ కెమెరాలను సైతం వినియోగిస్తున్నామని, యువత ఎక్కడ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని, శాంతియుతంగా నిమజ్జనం జరిగేందుకు సహకరించాలని కోరారు.మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు విజయకుమార్ ,వక్త అప్పల ప్రసాద్, చింత సాంబమూర్తి, శాంతి కమిటీ సభ్యులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఖలీమ్, ఆఫీస్, గోలీ మధుసూదన్ రెడ్డి, సంపత్, నాగం వర్షిత్ రెడ్డి తదితరులు మాట్లాడారు.జిల్లాలో ప్రత్యేకించి నల్గొండ పట్టణంలో వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు కృషిచేసిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ , అడిషనల్ ఎస్పీ, డిఎస్పి, పోలీసు అధికారులు , ఆర్డీవో ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులను మంత్రి శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, అబ్బగోని రమేష్ గౌడ్, డీఎస్పీ శివరాంరెడ్డి, ఆర్ డి ఓ రవి, మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్, తహసిల్దార్ శ్రీనివాస్, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు తదితరులు ఉన్నారు .

## పోయిరావయ్యా... గణపయ్యా..!

- పేట జిల్లాలో ఘనంగా నిమజ్జనం వేడుకలు
- డప్పు దరువులు మహిళల కోలాటం నృత్యాలతో దారి పొడవున సందడి
- ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ పోలీసుల బందోబస్తు
- మినీ ట్యాంక్ బండ్‌పై భారీ క్రేన్‌లతో గణనాథుని నీటిలో విడుదల
- ప్రశాంతంగా ముగిసిన వినాయక శోభాయాత్ర




**సూర్యాపేట, సెప్టెంబర్ 16(మనం ప్రతినిధి) :** గణనాదుని నవరాత్రి ఉత్సవంలో భాగంగా తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు అందుకున్న వినాయకుడు సోమవారం పోయిరావయ్య గణపయ్య అంటూ.. భక్తులు చివరి రోజు భక్తి శ్రద్ధతో గణనాధునికి పూజలు నిర్వహించి ఘనంగా నిమర్జన శోభాయాత్రను ప్రారంభించారు. తొమ్మిది రోజులు పూజలు అందుకున్న గణనాధుని చేతి లడ్డు చేజెక్కించుకునేందుకు పలు వార్డుల్లో భక్తులు పోటీపడి వేలంపాటలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ సద్దలచెరువు లో ప్రాంతంలో.. లంబోదరుని నిమర్జనం చేయడం జరిగింది మూషిక వినాయకుని ప్రధాన కూడల నుండి భారీ ఎత్తున భక్తులు డప్పు దరువులతో నృత్యం చేస్తూ చిన్నపిల్లల డ్యాన్స్ కేరింతల నడుమ గణపతి అబ్బా మోరియా అంటూ శోభాయాత్రను కొనసాగించారు. నిమర్జనం చివరి రోజు కావడంతో భారీ వినాయక విగ్రహాలు తరలి వెళ్తున్న నేపథ్యంలో అధికారి యంత్రాంగం భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు త్రాగునీటి సదుపాయం కల్పించింది వినాయక విగ్రహాలు తరలి వెళ్తున్న నేపథ్యంలో దారి పొడుగునా ఆయా గణేష్ మండపాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రంగులు చల్లుకుంటూ ముఖ్యంగా మహిళల కోలాటాలు నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి వినాయక స్మరించుకుంటూ నిమర్జనం ప్రాంతానికి భారీ ర్యాలీగా తరలి వెళారు. మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారీ క్రేన్లతో సిబ్బంది గణనాధుని నీటిలో వదిలేయడం జరిగింది. జిల్లాలో పెద్ద ఎత్తున నిమర్జనం వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. అంతేకాకుండా సీసీ కెమెరాలు నడుమ నిరంతరం పర్యవేక్షిస్తూ పోలీసులు అధికారులు దృష్టి సారించారు. అర్ధరాత్రి వరకు నిమజ్జన వేడుకలు పూర్తి చేసి పోలీసులు అటు అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు.

## గణేశుడిని నిమజ్జనం చేసిన కలెక్టర్



**సూర్యాపేట, సెప్టెంబర్ 16(మనం ప్రతినిధి) :** జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకునికి సోమవారం జిల్లా కలెక్టర్ తేజస్ నం ద్ లాల్ పవార్ దంపతులు ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం నిమజ్జనానికి గణేశుని ప్రతిమను స్వయంగా తీసకువెళ్లి సద్దల చేరువులో నిమజ్జనం చేసిన కలెక్టర్ దంపతులు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలను భక్తులు యంత్రాంగపు సూచనలను పాటిస్తూ దిగ్విజయంగా జరుపుకున్నారని పేర్కొన్నారు. ఎలాంటి విఘ్నాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా 9 రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో దిగ్విజయంగా జరుపు కున్నారని హర్షం వ్యక్తం చేశారు.నిమజ్జన కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలు జిల్లా యంత్రాంగపు సలహాలు, సూచనలు పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీలు అయాజ్, శ్రావణ్ క్యాంపు కార్యాలయ సిబ్బంది అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## లింగరాజుపల్లి గ్రామం రెడ్డి కాలనీలో భక్తులకు అన్నదానం



**ఆత్మకూర్ (ఎం), సెప్టెంబర్ 16 (మనం న్యూస్) :** లింగరాజుపల్లి గ్రామంలో రెడ్డి కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ఎర్ర రాజి రెడ్డి, మేకల మహేష్ రెడ్డి, నల్ల ప్రవీణ్ రెడ్డి, నల్ల నరేష్ రెడ్డి, కావట్టి మధు ఎర్ర దిలీప్ రెడ్డి, ఎర్ర సంతోష్ రెడ్డి, ఎర్ర విట్టల్ రెడ్డి, ఎర్ర నర్సిరెడ్డి, ఎర్ర వెంకటరెడ్డి మెట్టు తిరుమల్ రెడ్డి, ఎర్ర సుదర్శన్ రెడ్డి, ఎర్ర మాస్ రెడ్డి, ఎర్ర బుచ్చిరెడ్డి, మేకల మహేందర్ రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేసిన వాకిటి



**వలిగొండ, సెప్టెంబర్ 16 (మనం న్యూస్) :** వలిగొండ మండలం ఆరూరు గ్రామంలో ఇటీవల అనారోగ్య కారణాలతో గ్రామానికి చెందిన పురమ శ్రీనివాస్ మృతి చెందడంతో అతని కుటుంబానికి సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి 5000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని చేశారు. ఇంకా అదే గ్రామానికి చెందిన కొడితల కరుణాకర్ 3000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర నరసింహ, మాజీ ఉపసర్పంచ్ సుక్క ముత్యాలు, నాయకులు అంజయ్య, శ్రీశైలం, పరమేష్, ఎట్టయ్య, నరసింహ, స్వామి, ముత్యాలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గణేష్ మండప నిర్మాణానికి శంకుస్థాపన



**వలిగొండ, సెప్టెంబర్ 16 (మనం న్యూస్) :** వలిగొండ మండలం ఆరూర్ గ్రామంలో గణేష్ మండప నిర్మాణానికి గాను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి సోమవారం శంకుస్థాపన, భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో మండపం కావాలని కొందరు అనంతరెడ్డిని కోరగా అందుకు ఆయన అంగీకరించి మండప నిర్మాణానికి తన సొంత నిధులుఇస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలోని గణేష్ విగ్రహాల నిమజ్జనం ఖర్చుల నిమిత్తం 40 000 రూపాయలు కూడా అనంతరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర నరసింహ, మాజీ ఉపసర్పంచ్ సుక్క ముత్యాలు, నాయకులు పరమేష్, నరసింహ, శ్రీకర్, సాయి, మారగొని శీను, మచ్చేందర్, నిఖిల్, మచ్చగిరి, రేవంత్, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు చీరల పంపిణీ



**ఆత్మకూర్(ఎం), సెప్టెంబర్ 16 (మనం న్యూస్) :** ఆత్మకూర్ ఏం మండలంలోని ఇంద్ర నగర్ కాలనీలో సోమవారం మహిళలకు చీరలను తాజా మాజీ సర్పంచ్ నగేష్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు ప్రత్యేకమైన ధన్యవాదములు తెలియజేశారు.

## ఎండిపోతున్న పంట పొలాలకు తక్షణమే నీళ్లు ఇచ్చి రైతులను ఆదుకోవాలి

- అధికారులు టెండర్ల పేరుతో కాలయాపన..
- సిపిఎం హుజూర్ నగర్ మండల కార్యదర్శి పోషనబోయిన హుస్సేన్



**హుజూర్ నగర్,సెప్టెంబర్ 16(మనం న్యూస్) :** ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తెగిన సాగర్ కాలువ కట్టలు త్వరగా పూర్తిచేసి సాగు భూములకు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం హుజూర్ నగర్ మండల కార్యదర్శి పోషనబోయిన హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం హుజూర్ నగర్ మండల పరిధిలోని అమరవరం గ్రామంలో ఎండిపోతున్న పంట పొలాలను సిపిఎం పార్టీ నాయకులతో కలసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు కాలవ కట్టలు తెగి పది రోజులు గడుస్తున్న అధికారులు టెండర్ల పేరుతో కాలయాపన చేయటం వలన ఏమీ ఆధారం లేని రైతుల పంట పొలాలు ఎండిపోతున్నాయని అధికారులు త్వరగా తెగిపోయిన కాలువ కట్టలు మరమ్మత్తులు చేసి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు.అకాల వర్షాల మూలంగా మేటలు వేసిన పంట పొలాలకు నష్ట పరిహారం అందించాలని, మండల పరిధిలోని అనేక గ్రామాలలో పంట పొలాలు ఎండిపోయే దశలో ఉన్నాయని తెగిపోయిన రోడ్లను ఆర్ అండ్ బి అధికారులు తక్షణమే రోడ్లు మరమ్మతులు చేయాలని విద్యుత్ అధికారులు పంట పొలాలలో పడిపోయిన విద్యుత్ స్తంభాలను తీసి మరమ్మత్తులు చేసి కరెంటు సరఫరా చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు మాదూరి నరసింహ చారి,పారుపల్లి శ్రీనివాస్,సామల. అనిమిరెడ్డి,ఉస్తేల సైదిరెడ్డి,షేక్ ఖాసిం,శాఖమూరి కృష్ణమూర్తి,కట్ట చిన్న గోపాలరావు,తేనె సీతా రాములు,వెంకన్న,తదితరులు, పాల్గొన్నారు.

# వైన్ షాపులు ఆకస్మికంగా తనిఖీ



- బెల్ట్ షాపులకు మద్యం అమ్మరాదు
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**మునుగోడు,సెప్టెంబర్ 16(మనం న్యూస్) :** మండల కేంద్రంలో సోమవారం రోజున ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పర్యటించి వైన్ షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు వైన్ షాప్ యాజమాన్యులతో ఈ సందర్భంగా మాట్లాడుతూ నకిలీ మందు అమ్ముతున్నారా అని అడిగి మద్యం బాటిల్స్ ను పరిశీలన చేశారు.పక్కనే ఉన్న పర్మిట్ రూముల్లో ఉదయాన్నే మద్యం తాగుతున్న మద్యం బాబులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.మీరు ఉదయాన్నే ఇలా తాగుడుకు బానిసైతే కుటుంబ పరిస్థితి ఏంటి అని సీరియస్ అయి మద్యం బాబులను పర్మిట్ రూము నుండి బయటికి పంపిచారు.ఉదయం పూట పర్మిట్ రూముల్లోకి అనుమతి ఇవ్వొద్దంటూ వైన్ షాపుల యజమానులకు హుకుం జారీచేశారు. బెల్ట్ షాపులకు మద్యం అమ్ముతున్నారా అంటూ ఆరా తీశారు. యువత మద్యపానాలకు గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీస్ వారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో గుండ్లోరిగూడెం గ్రామంలో బెల్ట్ షాప్ బందుకు సహకరించినందుకు షాప్ యాజమాన్రాలను శాలువాతో సత్కరించి గ్రామ అభివృద్ధికి పది లక్షల నిధులను మంజూరు చేశారు. నియోజకవర్గంలో రోడ్ల గురించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో. మండలాధ్యక్షుడు భీమనపల్లి సైదులు, ఎస్ఐ చందా వెంకటేశ్వర్లు, పాల్వాయి చెన్నారెడ్డి, పాల్వాయి గోవర్ధన్ రెడ్డి, పాల్వాయి జితేందర్ రెడ్డి, ముచ్చపోతుల శ్రీనివాస్, జంగిలి నాగరాజు, ఎండీ అన్వర్, జక్కల శ్రీను, యాదయ్య, జాలమని, బెల్లీ పూర్ణ, జిట్టగోని సైదులు, దోటి మహేశ్, పోలీస్ సిబ్బంది, నాయకులు,కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

# రవి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఆర్థిక సాయం

**ఆత్మకుర్(ఎం), సెప్టెంబర్ 16 (మనం న్యూస్) :** ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ నాయకులు బూడిది రవి(మండల కాంగ్రెస్ నాయకులు బూడిది శేఖర్ తమ్ముడు) అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న స్థానిక తాజా మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్ మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మిరెడ్డి మృతుడు బూడిది రవి పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య స్ఫూర్తితో తాజా మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్ వారి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మెన్ జిల్లాల శేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోతగాని మల్లేశం, మాజీ ఎంపీటీసీ దిగోజు నర్సింహా చారి, పాక్స్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి, గౌడ సంఘం అధ్యక్షులు పంజాల నర్సయ్య, నాయకులు గుండెగాని అయిలయ్య, బొబ్బల అంజి రెడ్డి, ఎద్దు వెంకటేశ్వర్లు, పైల్ల దామోదర్ రెడ్డి, తవిటి రాములు, దొంతరబోయిన భాస్కర్, ఎలగందుల శ్రీను, ఎలగందుల మహేష్, తొండల అనిల్, గుండెగాని కిరణ్, యాస సుభాష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా శ్రీను నాయక్



**సంస్థాన్ నారాయణపురం,సెప్టెంబర్ 16, మనం న్యూస్ :** మండలంలోని డాకు తండాకు చెందిన కరెంటోతు శ్రీను నాయక్‌ను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సిఫారిసుల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా ఏన్నుకున్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా డిసిసి అధ్యక్షులు అందెం సంజీవరెడ్డి నియమాక పత్రాన్ని పంపిణి చేశారు. పంపిణి చేసిన నియమాక పత్రాన్ని సోమవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేతులమీదుగా అందజేస్తూ అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా కరెంటోతు శ్రీను నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియమించిన జిల్లా అధ్యక్షులు అందెం సంజీవరెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞాతలు తెలుపుతూ పార్టీ అభివృద్ధి కోరకు అనునిత్యం పనిచేస్తానన్ని అయన అన్నారు. మండలంలోని మందుగుల బాలకృష్ణను జిల్లా ఉపాధ్యాక్షులుగా, గుత్త ఉమాప్రేమ్‌చందర్‌రెడ్డి, కరెంటోతు బిక్షపతి నాయక్ లను జిల్లా జనరల్ సెక్రటరీగా, ముద్దంగుల నర్సింహ్మా,ఏపూరి సతీష్ నోముల మాదవరెడ్డిను సెక్రటరీలుగా, ఏన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి శాలువతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

మనం
Follow : @Manamnews



# భక్త గణ యాత్ర

## ట్యాంక్‌బండ్ పరిసరాల్లో నిమజ్జన జోష్





**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** బొజ్జ గణపయ్య దివ్య మంగళరూపాలను కనులారా వీక్షించే అద్భుత ఘట్టానికి భాగ్యనగరం సిద్ధమైంది. మంగళవారం కనులపండువగా సాగే గణనాథుడి శోభాయాత్రకు సర్వ సన్నద్ధమైంది. విభిన్న రకాల రూపాల్లో నవరాత్రులు అలరించిన గణనాథులు.. నేడు నిమజ్జన బాట పట్టనున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వినాయకుల ఊరేగింపులో ఆడి పాడి.. సందడి చేయనున్నారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బల్దియా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వినాయక ప్రతిమల నిమజ్జనానికి 468 క్రేన్లు, నగరవ్యాప్తంగా 73 బేబీ పాండ్లను ఏర్పాటు చేసింది. మొత్తం 15 వేల మంది బల్దియా సిబ్బంది భక్తులకు సేలందించనున్నారు. దాహార్తి తీర్చేందుకు జలమండలి 35 లక్షల మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేయనున్నది. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టారు. నిమజ్జనం కోసం వచ్చే విగ్రహాలకు స్వాగతం పలికేందుకు ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక స్వాగత వేదికలను నెలకొల్పింది. భక్తుల కోసం అదనంగా మెట్రో, ఎంఎంటీఎస్ రైళ్లు, బస్సులు నడవనున్నాయి.

### శోభాయాత్ర రూట్లు ఇవే..

బాలాపూర్ నుంచి వచ్చే గణేషుడి శోభాయాత్ర చాంద్రాయణగుట్ట, ఫలక్నుమా రైల్వే ఓవర్ బ్రిడ్జి, నాగుల చింత, చార్మినార్, అఫ్జల్గంజ్, ఎంజే మార్కెట్, అబిడ్స్, బషీర్‌బాగ్, లిబర్టీ, అంబేద్కర్ విగ్రహం, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు వరకు జరుగుతుంది.

సికింద్రాబాద్ వైపు వచ్చే గణనాథులు ఆర్పీరోడ్డు, ఎంజేరోడ్డు, కర్బాలమైదాన్, కవాడిగూడ, ముషీరాబాద్ క్రాస్ రోడ్డు, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, నారాయణగూడ క్రాస్‌రోడ్డు, హిమాయత్‌సాగర్ వై జంక్షన్ నుంచి ప్రధాన యాత్రలో కలుస్తాయి. చిలకలగూడ వైపు నుంచి వచ్చే యాత్ర గాంధీ దవాఖాన వద్ద నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్, నారాయణగూడ ఫ్లై ఓవర్, నారాయణగూడ వై జంక్షన్, హిమాయత్‌సాగర్ నుంచి లిబర్టీ వద్ద ప్రధాన ర్యాలీలో కలువాలి.

ఉప్పల్ వైపు నుంచి వాహనాలు శ్రీరమణ జంక్షన్, 6 నం. జంక్షన్, తిలక్నగర్, శివం రోడ్డు, ఎన్సీసీ, విద్యానగర్ టీ జంక్షన్, హిందీ మహా విద్యాలయం, ఫీవర్ ఆసుపత్రి, బర్కత్‌పురా, వైఎంసీఏ, నారాయణగూడ ఎక్స్ రోడ్స్, ఆర్టీసీ క్రాస్ రోడ్డు వైపు నుంచి వచ్చే ర్యాలీలో కలుసుకోవాలి. అలాగే దిల్‌సుఖ్‌నగర్, ఐఎస్ సదన్, సైదాబాద్ వైపు నుంచి నల్లగొండ క్రాస్ రోడ్డు వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు మూసారాంబాగ్, అంబర్‌పేట్ మీదుగా హిమాయత్‌సాగర్ వైపునకు వెళ్లి ప్రధాన ర్యాలీలో కలువాలి. అలాగే తార్నాక నుంచి వచ్చే వాహనాలు ఫీవర్ ఆసుపత్రి వద్ద నుంచి ప్రధాన ర్యాలీలో కలువాలి.

టోలిచౌక్, మెహిదీపట్నం వైపు నుంచి వచ్చే వాహనాలు మాసబ్‌ట్యాంక్, ఓల్ సైఫాబాద్, ఇక్బాల్ మినార్ నుంచి ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకోవాలి. ఎర్రగడ్డ, ఎస్ఆర్‌నగర్, పంజాగుట్ట, ఖైరతాబాద్ వైపు నుంచి నిరాంకారి వద్ద యాత్రలో కలువాలి. ఆసీఫ్‌నగర్ సీతారాంబాగ్, అగాపురా, గోషామహల్, అలాస్క, మాలకుంట జంక్షన్ నుంచి వచ్చే యాత్ర ఎంజే మార్కెట్ వద్ద ప్రధాన యాత్రలో కలువాలి.

### నిరంతర విద్యుత్..

గణేశ్ విగ్రహాల శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. అక్కడి నుంచే విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటారు. నిరంతర విద్యుత్, అదనపు లోడ్‌కు సరిపోయేలా 500 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు, 315 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 31, 160 కేవీఏ సామర్థ్యంతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్లను 37 వరకు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. బాలాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు సాగే గణేశ్ విగ్రహాల శోభా యాత్ర కోసం సుమారు 55 కి.మీ మేర 11 కేవీ ఎల్ టీ కేబుల్స్‌ను, పోల్స్, కండక్టర్స్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎక్కడైనా అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడితే విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్ నంబర్‌కు లేదా 100, 1912 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

### పార్కింగ్ స్థలాలు ఇవే..

నిమజ్జనం వీక్షించేందుకు వచ్చే భక్తులు తమ వాహనాలను ఎన్టీఆర్ స్టేడియం, కట్టమైసమ్మ టెంపుల్, లోయర్ ట్యాంక్‌బండ్, పబ్లిక్ గార్డెన్స్, బుద్ధ భవన్ వెనుక వైపు, ఆదర్శనగర్ రోడ్డు, బీఆర్కే భవన్, జీహెచ్ఎంసీ రోడ్డు, ఖైరతాబాద్ జంక్షన్లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ జంక్షన్, ఎంఎంటీఎస్ స్టేషన్ (ఖైరతాబాద్)లో పార్కింగ్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

### అర్ధరాత్రి వరకు మెట్రో

గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో ఉదయం 6 నుంచి అర్ధరాత్రి 1 గంట వరకు (అన్ని టెర్మినల్స్ నుంచి చివరి రైలు) అన్ని మార్గాల్లో మెట్రో సేవలు అందుబాటులో ఉంచినట్లు ఎల్ అండ్ టీ, హెచ్ఎంఆర్ఎల్ వర్గాలు తెలిపాయి. అలాగే భక్తుల కోసం గ్రేటర్ వ్యాప్తంగా ఆర్టీసీ 600 ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

### నిమజ్జనం.. జరపైలం

గణనాథుడి శోభాయాత్రలో భారీగా భక్తులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే.. ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని నిపుణులు అంటున్నారు. చిన్నా.. పెద్ద అందరూ నిమజ్జనానికి తరలివెళ్తుంటారు. అయితే పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలంటున్నారు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉండకుండా.. వారిని నిరంతరం కంటకనిపెడుతూ.. ఉండాలని, లేదంటే వారు జనంలో తప్పిపోయే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు. అలాగే నిమజ్జనం తరలించే వాహనాలపై పరిమితికి మించి భక్తులు ఎక్కించడం మంచిది కాదని సూచిస్తున్నారు. నిమజ్జన యాత్రలో డ్యాన్సులు, సంగీతం శృతి మించకుండా ఉండేలా నిర్వాహకులు చూసుకోవాలంటున్నారు. ముఖ్యంగా విద్యుత్ తీగలతో మరింత అప్రమత్తంగా ఉండాలంటున్నారు.

### బాలాపూర్ టు ట్యాంక్‌బండ్..

దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా సాగే హైదరాబాద్ గణనాథుల నిమజ్జన శోభాయాత్రకు వేలాదిగా భక్తులు తరలిరానున్నారు. బాలాపూర్ నుంచి ట్యాంక్‌బండ్ వరకు శోభాయాత్ర సాగనున్నది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా వివిధ ప్రభుత్వ శాఖలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఖైరతాబాద్ భారీ గణనాథుడి శోభాయాత్రను ఉదయం 6.30 గంటలకు ప్రారంభించి.. మధ్యాహ్నం 1.30 గంటలోపే నిమజ్జనం పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

### 468 క్రేన్లు సిద్ధం

గ్రేటర్‌లో వినాయక ప్రతిమల నిమజ్జనానికి 468 క్రేన్లను సిద్ధం చేశారు. హుస్సేన్‌సాగర్ వద్ద 38 క్రేన్లను అందుబాటులో ఉంచారు. 15వేల మంది బల్దియా సిబ్బంది నిమజ్జన ప్రక్రియలో పాల్గొని పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టనున్నారు. శోభాయాత్ర నిర్వహించే మార్గాల్లో 52,270 విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. రహదారుల మరమ్మతులు పూర్తి చేశారు.

### 35 లక్షల మంచినీటి ప్యాకెట్లు

వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. నిమజ్జనం సందర్భంగా సోమవారం ఆయన డైరెక్టర్లు, సీజీఎం, జీఎంలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నిమజ్జనానికి 122 వాటర్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. శోభాయాత్ర జరిగే రూట్లలో 35 లక్షల వాటర్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు.

### 73 బేబీ పాండ్స్

హుస్సేన్‌సాగర్, సరూర్‌నగర్‌తో పాటు 33 చెరువుల వద్ద 250 మంది స్విమ్మర్లు, 400 మంది డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేశారు. పీవోపీ విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేకంగా 73 బేబీ పాండ్స్‌ను, కొలనుల వద్ద 27 బోట్లను ఏర్పాటు చేశారు. నగరం నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులకు మొబైల్, స్టాటిక్ టాయిలెట్లను అందుబాటులో ఉంచారు.

## అత్యవసర వైద్యం కోసం మెడికల్ క్యాంపుల ఏర్పాటు

జంటనగరాల్లో గణేశ్ నిమజ్జన జోష్ కనిపిస్తోంది. నెక్లెస్ రోడ్డు, ట్యాంక్‌బండ్ పరిసరాల్లో సందడి వాతావరణం కనిపిస్తోంది. లంబోదరుడి నిమజ్జనం సందర్భంగా జంట నగరాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అత్యవసర వైద్య చికిత్స అవసరమున్నవారికి అంబులెన్స్‌లను కూడా ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ.. అధికారులను ఆదేశించారు. అందుకుతగ్గట్లు వైద్య, ఆరోగ్య శాఖ ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సచివాలయంలో ఆయన మాట్లాడుతూ.. 'నిమజ్జనం జరిగే ప్రాంతాలలో హెల్త్ క్యాంపులు, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలి. అత్యవసర పరిస్థితుల్లో సత్వర వైద్యాన్ని అందించేందుకు డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండాలి' అని దామోదర సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనం జరుగుతున్న ప్రాంతాలలో ముందస్తుగా 30 చోట్ల హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోని ట్యాంక్ బండ్‌కు లక్షలాదిగా తరలివస్తున్న భక్తులు, పర్యాటకులకు అత్యవసర పరిస్థితులలో వైద్య సేవలు అందించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అందుకు తగ్గట్లు డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచారు. వైద్య అత్యవసర పరిస్థితులలో ఆసుపత్రికి చేరుకునే వారికి సత్వర వైద్యాన్ని అందించేందుకు సమాయత్తం అయ్యారు.

## భక్తులు శాంతియుతంగా జరుపుకోవాలి

### ఖైరతాబాద్ వినాయకుడి వద్ద మంత్రి పొన్నం పూజలు

గణేశ్ నవరాత్రులు విజయవంతమయ్యాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆయన ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం తరఫున నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని.. మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం ఇచ్చినట్లు చెప్పారు. నిమజ్జనం కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ట్యాంక్ బండ్ చుట్టూ 135, మొత్తం జీహెచ్ఎంసీ పరిధిలో 300కు పైగా క్రేన్‌లు అందుబాటులో ఉంటాయని వివరించారు. నిమజ్జన ఉత్సవాలకు ప్రజలు సహకరించాలని కోరారు. వీలైనంత వరకు మంగళవారం రాత్రి లోపు నిమజ్జన కార్యక్రమాలు పూర్తి చేయాలని భావిస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ చెప్పారు. హైదరాబాద్ జంట నగరాలకు సంబంధించి గణేశ్ నిమజ్జనం కోసం ఏర్పాట్లు పూర్తి చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.



మహాగణపతి నిమజ్జనం కోసం జరుగుతున్న ఏర్పాట్లు పొన్నం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొదటిసారి మండపాలకు ఉచిత విద్యుత్ ఇచ్చామని తెలిపారు. శాంతియుతంగా భక్తి శ్రద్ధలతో నిర్వాహకులు పూజ కార్యక్రమాలు చేశారన్నారు. మంగళవారం నిమజ్జన ఘట్టమని.. భక్తులు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు.

## రోడ్లపై చెత్త వేయొద్దు

### కమిషనర్ ఆమ్రపాలి



మహా నిమజ్జనానికి జీహెచ్ఎంసీ తరఫున ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో బల్దియా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... రోడ్లపై చెత్త వేయకుండా జీహెచ్ఎంసీ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. మొత్తం 15 వేల మంది జీహెచ్ఎంసీ సిబ్బంది నిమజ్జనంలో పాల్గొంటున్నారని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో 465 క్రేన్స్, హుస్సేన్ సాగర్లో 38 క్రేన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో జీహెచ్ఎంసీ నిమజ్జన కార్యక్రమాలు ఏర్పాటు చేసిందన్నారు. రేపటి నుంచి మూడు రోజుల పాటు జీహెచ్ఎంసీ సిబ్బందికి అసలైన పని ఉంటుందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 160 గణేశ్ టీమ్స్ పనిచేయనున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా నిమజ్జనానికి 10 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు అయ్యాయి. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. నిమజ్జనం మరుసటి రోజు అదనంగా మరో 500 మంది సిబ్బంది పాల్గొననున్నారు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా 73 వినాయక పాండ్స్, పెద్ద చెరువులలో నిమజ్జనానికి ఏర్పాటు చేశారు. అలాగే మూడు రోజులపాటు జీహెచ్ఎంసీ సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. మంగళవారం ఉదయం ఖైరతాబాద్ వినాయకుడి శోభాయాత్ర ప్రారంభం అవుతుందని.. ఇప్పటికే పనులు జరుగుతున్నాయన్నారు. సమయానికి నిమజ్జనం పూర్తి చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. ఎల్లుండి వర్కింగ్ డే అని ఆలోపు నిమజ్జనం పూర్తి చేసుకుంటే ప్రజలకు ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు.

## ఖైరతాబాద్ వినాయకుడికి భారీగా ఆదాయం

### కోటి పదిలక్షలు సమకూరినట్లు నిర్వాహకుల వెల్లడి

### హుండీ ద్వారా 70 లక్షలు..ప్రకటనల రూపంలో 40 లక్షలు

ఖైరతాబాద్ మహాగణపతి హుండీ ఆదాయాన్ని లెక్కించగా, మొత్తం రూ.70 లక్షల ఆదాయం వచ్చినట్లు నిర్వాహకులు వెల్లడించారు. హోర్డింగులు, ఇతర సంస్థల ప్రకటన రూపంలో మరో రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. తొలిసారిగా ఖైరతాబాద్‌లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో హుండీల లెక్కింపు చేపట్టారు. గత పదిరోజుల్లో నగదు రూపంలో ఈ ఆదాయం సమకూరినట్లు కమిటీ పేర్కొంది. ఇకపోతే నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్నందున సోమవారం దర్శనాలు నిలిపివేశారు. దీంతో దర్శనం కోసం వచ్చిన భక్తులు నిరాశతో తిరిగి వెళ్లారు. ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి సిద్ధమయ్యారు. మంగళవారం మధ్యాహ్నం మహాగణపతి గంగమ్మ ఒడికి చేరనున్నారు. నిమజ్జనం ఏర్పాట్లలో భాగంగా సోమవారం ఉదయం ఖైరతాబాద్ గణనాథుడి వద్ద కర్రల తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. నాలుగు వైపులా బారికేడ్లును పోలీసులు ఏర్పాటు చేశారు. మరోవైపు ట్యాంక్‌బండ్ వద్ద గణేశ్ నిమజ్జన కార్యక్రమం కొనసాగుతోంది. హుస్సేన్ సాగర్ చుట్టూ భారీగా క్రేన్లు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ఎలాజా, జలవిహార్, బేబీ వాటర్ పాండ్ వద్ద క్రేన్లు ఏర్పాటు చేశారు. హుస్సేన్ సాగర్ చుట్టూ మె?త్తంగా 31 క్రేన్లు ఏర్పాటు అయ్యాయి. క్రేన్ నంబర్ 4 వద్ద ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం జరుగనుంది. మరోవైపు గణేశ్ విగ్రహాల నిమజ్జనాలతో ట్యాంక్‌బండ్ పరిసరాల్లో భారీగా ట్రాఫిక్‌జామ్ అయ్యింది.



కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గణేశ్ విగ్రహాల నిమజ్జనాల కోసం భారీగా వాహనాల రాకతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఖైరతాబాద్, లక్డీకాపూల్ సహా పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించింది. ఖైరతాబాద్, లక్డీకాపూల్, ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వినాయక నిమజ్జనాలు ఆలస్యం అవుతున్నాయి. హుస్సేన్ సాగర్ చుట్టూ సరిపడా క్రేన్లు లేకపోవడంతో నిమజ్జనం కోసం గణనాథులు బారులు తీరాయి. దాదాపు 5 కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. అర్ధరాత్రి నుంచి నిమజ్జనాల కోసం గణనాథులు వెయిటింగ్‌లో ఉన్నాయి. ఖైరతాబాద్, ఎన్టీఆర్ మార్గ్, నెలకెస్ రోడ్ మార్గాలను పోలీసులు మూసివేశారు. ట్యాంక్ బండ్‌కు వచ్చే వాహనాలను దారి మళ్లించారు.

## బాలాపూర్ లడ్డూ @ 30 ఏళ్లు

### వేలం పాటలో పాల్గొనేవారికి కొత్త రూల్స్

### ముందే డబ్బులు డిపాజిట్ చేయాలని నిబంధన

బాలాపూర్ గణేశ్ లడ్డూ వేలంపాట 30 ఏళ్లు పూర్తి చేసుకుంది. వేలంపాట ప్రక్రియలో ఉత్సవకమిటీ తాజాగా కొత్త నిబంధన తీసుకొచ్చింది. పోటీదారులు ముందస్తుగా డబ్బులు డిపాజిట్ చేయాలని నిర్ణయించింది. గ్రామస్థుల నుంచి వేలంపాటకు తీవ్రమైన పోటీ నెలకొన్న నేపథ్యంలోనే ఈ నిబంధన తీసుకొచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. 2023లో బాలాపూర్ లడ్డూ రికార్డు స్థాయిలో రూ.27 లక్షలు పలికింది. స్థానికేతరుడైన దాసరి దయానంద్‌రెడ్డి లడ్డూను దక్కించుకున్నారు. ఈ ఏడాది రూ.30 లక్షలు పలుకుతుందని అంచనా వేస్తున్నారు. 1994 నుంచి బాలాపూర్‌లో లడ్డూ వేలం పాట కొనసాగుతోంది. మొదట రూ.450తో ప్రారంభం కాగా.. 2016లో రూ.14.65 లక్షలు, 2017లో రూ.15.60లక్షలు, 2018లో రూ.16.60 లక్షలు, 2019లో 17.60 లక్షలు, 2021లో రూ.18.90 లక్షలు, 2022లో రూ.24.60 లక్షలు పలికింది. 2020లో కరోనా కారణంగా వేలం పాట రద్దు చేశారు. బాలాపూర్ ముఖ్య కూడలిలోని బొడ్రాయి వద్ద వేలం పాట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది మంగళవారం ఉదయం 9.30 గంటలకు వేలంపాట ప్రారంభం కానుంది. 11 గంటలకు ట్యాంక్ బండ్ వైపు శోభాయాత్ర ప్రారంభం కానుంది.



# పేరు మార్చి తెలంగాణ చరిత్రనే కనుమరుగు చేస్తున్నరు

- బీజేపీ అధికారంలోకి వస్తే సర్దార్ పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం
- 6 గ్యారంటీలపై డైవర్ట్ చేసేందుకు రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకోవాలని విజ్ఞప్తి



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 16 (మనం న్యూస్) :** 'తెలంగాణ ప్రజా పాలన దేనికోసం? ఎవరికి భయపడి 'తెలంగాణ విమోచన దినోత్సవం' పేరుతో అధికారికంగా ఎం దుకు ఉత్సవాలు నిర్వహించడం లేదు? పేరు మార్చి తెలం గాణ చరిత్రనే కనుమరుగు చేస్తున్నరు. నిజాంపై పోరాడి ప్రా ణాలర్పించిన వారి త్యాగాలను అవమానిస్తున్నరు. అందుకే 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమానికి హాజరు కావడం లేదు. కాంగ్రెస్‌కు చేతనైతే 'తెలంగాణ విమోచన దినోత్సవం' పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తే తప్పకుండా నేనే హాజరవుతా. వారికి చేతకాకుంటే కేంద్రం పరేడ్ గ్రౌండ్ లో అధికారికంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ విమోచన దినోత్సవానికి' హాజరు కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా.''అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. సోమవారం కరీంనగర్ లో మీడియాతో మాట్లాడుతూ విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రశాంత వాతావరణంలో ఎలాంటి గొడవ లేకుండా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు . గణేశ్ నిమజ్జన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై ప్రశాంతంగా జరుపు కోవాలని కోరారు . హుస్సేన్ సాగర్ లో గణేశ్ నిమజ్జనంపై రాష్ట్ర ప్రభుత్వం భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీతో చర్చించి ప్రజలకు అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. హిందువుల పండుగలపై వివక్ష చూపుతున్నారనే భావన హిం దువుల్లో నెలకొందని,ఆ భావనను తొలగించేలా ప్రభుత్వం వ్యవహరించాలన్నారు. కరీంనగర్ లోని పోతులూరి వీరబ్ర హ్మేంద్రస్వామి ఆలయాన్ని దర్శించుకుని వారు నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నా రు.తెలంగాణ విమోచన దినోత్సవం తెలంగాణ ప్రజలకు పండుగ రోజన్నారు.నిజాం నిరంకుశ పాలనపై పోరాడిన సమర యోధుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 6 గ్యారంటీలపై శ్వేత పత్రం విడుదల చేయా లన్నారు. ఎవరికి భయపడి తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా ఎందుకు నిర్వహించడం లేదన్నారు. 'తెలంగాణ విమోచన దినోత్సవం' పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తే తప్పకుండా తానే హాజరవుతానన్నారు. చేతకాకుంటే కేంద్రం పరేడ్ గ్రౌండ్ లో అధికారికంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ విమోచన దినోత్సవానికి' హాజరు కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## భక్తి శ్రద్ధలతో నిమజ్జన వేడుకలు నిర్వహించుకోవాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్
- నిమజ్జన వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** వినాయక మండపాల నిర్వాహకులు నిర్ణీత సమయానికి విగ్రహాలను తరలించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఈ సెప్టెంబర్ 17న మంగళవారం వినాయక విగ్రహాల నిమజ్జనానికి సిరిసిల్లలోని మానేరు తీరంలో చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ పలు శాఖల అధికారులు సోమవారం పరిశీలించారు. వినాయక మంటపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తిశ్రద్ధల మధ్య వేడుకలను నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, యువత ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అధికారులు సూచించిన మేరకు సౌండ్ బాక్సు పెట్టుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్ళి, వేడుకలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి



**ధర్మపురి, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** నేడు జరగబోయే గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని రాం నరసింహారెడ్డి ఎస్సై మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం జరగబోయే గణేష్ నిమజ్జనాలను గోదావరి నది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ వినాయక నిమజ్జనాలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని నిమజ్జనం ఒక ఉత్సవం లాగా చూడాలని శోభయాత్రను జాగ్రత్తగా చూసుకోవాలని మద్యం మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని ప్రజలు భక్తులు గణేష్ మండప నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని వారు తెలిపారు.

## అమీన్‌పూర్‌లో ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** అమీన్‌పూర్‌లో సోమవారం గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగినట్లు ఎస్ఐ విజయారావు తెలిపారు. నిర్వాహకులు, భక్తులు సహకరించారని ఆయన పేర్కొన్నారు. కేటాయించిన చెరువులు వద్ద తమ పోలీసు శాఖ ముందుగా అన్ని చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు. సీఐ నాగరాజు ఆధ్వర్యంలో తీసుకున్న జాగ్రత్తలు ఫలించాయని పూర్తి ప్రశాంతంగా సోమవారం నిమజ్జనం ముగిసిందని తెలిపారు. సహకరించిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు ఎస్ఐ కృతజ్ఞతలు తెలిపారు.

## ఆంధ్రా, తెలంగాణ పేరుతో రాజకీయాలు

**తిరుమల, సెప్టెంబర్ 16 (మనం న్యూస్) :** ఆంధ్రా, తెలంగాణ అంటూ చేసే కుట్రలను భగ్నం చేస్తామని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్తారని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. తిరుమల శ్రీవారిని వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అరెకపూడి గాంధీపై విమర్శలు చేసిన కౌశిక్ రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. ఇప్పటికైనా కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలపై ఆలోచించాలని హితవు పలికారు. హైదరాబాద్ నగరంలోని చెరువుల్లో కబ్జాకు గురైన భూములను రక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను తీసుకొచ్చినట్లు దానం నాగేందర్ తెలిపారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసమే సీఎం రేవంత్ రెడ్డి ఈ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. అన్యాక్రాంతమైన ప్రాంతాల్లో నివాసం ఉన్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.

## రాజకీయాలకు దూరంగా యూనివర్సిటీలు

**అమరావతి, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** ఏపీలో గత ఐదేళ్లుగా రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారిన విశ్వవిద్యాలయాలను సమూలంగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. దీనిలో భాగంగా రాజకీయాలకు అతీతంగా విద్యారంగ నిపుణులను వీసీలుగా నియమించేందుకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. పరిశోధనపై దృష్టి సారించి, ర్యాంకింగ్స్ మెరుగు పరచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వర్సిటీలను జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలన్న సంకల్పం ఉన్న ఆచార్యుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. ఇందుకు సంబంధించి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 28 చివరి తేదీ అని ఆయన తన ఎక్స్(ట్విటర్)లో తెలిపారు.

## రివర్స్ టెండరింగ్ విధానం రద్దు

- జీవో నంబరు 67ను రద్దు చేస్తూ ఉత్తర్వులు

**అమరావతి, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** వైసీపీ ప్రభుత్వ పాలనలో అమల్లోకి తెచ్చిన రివర్స్ టెండరింగ్ విధానం రద్దు చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వం జారీ చేసిన రివర్స్ టెండర్ జీవో నంబరు 67ను రద్దు చేస్తున్నట్లుగా పేర్కొంటూ ఉత్తర్వులు ఇచ్చింది. 2019లో జగన్ ప్రభుత్వం తెచ్చిన రివర్స్ టెండరింగ్ విధానాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రివర్స్ టెండరింగ్ స్థానంలో పాత సంప్రదాయ టెండరింగ్ విధానం అమ ల్లోకి తెస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ పనులకు ఇక నుంచి పాత టెండర్ విధానాన్ని అనుసరి ంచాలని జీవోలో స్పష్టం చేసింది.

## ఒకేసారి ముగ్గురు ఐపీఎస్‌ల సస్పెన్షన్.. చారిత్రక నిర్ణయం



**అమరావతి, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** ఒకేసారి ముగ్గురు ఐపీఎస్ అధికారుల్ని సస్పెండ్ చేయడం చారిత్రక నిర్ణయమని ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు అన్నారు. ఇదొక సాహసోపేతమైన నిర్ణయమని తెలిపారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు నివేదిక ఇచ్చిన వెంటనే.. ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలకు ఉపక్రమించారని పేర్కొన్నారు. సోమవారం ఉండి నియోజకవర్గ కేంద్రంలో రఘురామ కృష్ణరాజు మీడియాతో మాట్లాడుతూ.. కాదంబరి జత్వాని అనే సినీ నటిని దారుణంగా హింసించడంలో ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులు కీలక పాత్ర పోషించారని అన్నారు. కాదంబరి తన ఫిర్యాదులో చెప్పలేని ఎన్నో విషయాలు తనకు ఇతరుల ద్వారా తెలిశాయన్నారు. సీతారామాంజనేయులు సస్పెన్షన్తో సంతృప్తి చెందా కాదంబరి జత్వాని ఫిర్యాదు మేరకు సీనియర్ ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయుల్ని సస్పెండ్ చేయడం సంతృప్తిగా ఉందని రఘురామ కృష్ణరాజు తెలిపారు. తన కేసులో ఉన్న ముగ్గురు అధికారుల్లో ఒకరిపై చర్యలు తీసుకున్నట్లుగా భావిస్తున్నానన్నారు. అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారి విజయ్ పాల్ కూడా జత్వాని కేసులో విశాల్ గున్ని తరహాలో వ్యవహరించారన్నారు. ఈ కేసులో విజయ్పాల్ను పట్టుకుంటే, అన్ని వివరాలు తెలుస్తాయన్నారు. ముగ్గురు ఐపీఎస్ అధికారులపై వేటు వేయడం హర్షనీయమని, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై నమోదైన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు.

# జానీ మాస్టర్‌కు జనసేన షాక్

- పార్టీ కార్యాక్రమాలకు దూరం చేస్తూ ప్రకటన



**అమరావతి, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఆయనపై అత్యాచారం కేసు నమోదవ్వడంతో జనసేన పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. జనసేన పార్టీలో జానీ మాస్టర్ క్రియాశీలకంగా పనిచేస్తుండటంతో కేసు నేపథ్యంలో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని జానీని పార్టీ ఆదేశించింది. ఈమేరకు జనసేన అధికారిక ప్రకటనను విడుదల చేసింది. వేములపాటి అజయ్ పేరుతో ఈ ప్రకటన విడుదలైంది. జానీ మాస్టర్‌పై రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన క్రమంలో పార్టీ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తక్షణమే ఈ ఆదేశాలు అమలులోకి వస్తాయని ప్రకటనలో పేర్కొన్నారు. కొంతకాలంగా జానీ మాస్టర్ జనసేన పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. పవన్ కళ్యాణ్‌కు ఆయన మద్దతు ఇస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లోనూ జనసేన పార్టీకి ప్రచారం చేశారు. ప్రముఖ కొరియోగ్రాఫర్‌గా పేరు తెచ్చుకున్న జానీ మాస్టర్‌పై ఓ యువతి అత్యాచారం కేసు పెట్టింది. ఆరోపణలు చేస్తున్న యువతి 2017లో ఓ ఛానల్‌లో ప్రసారమైన ప్రముఖ డ్యాన్స్ షోలో జానీ మాస్టర్‌కు పరిచయమైనట్టు ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పేర్కొన్నారు. ఆ తర్వాత జానీ మాస్టర్‌కు అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా ఉండాలంటూ ఆయన టీమ్ యువతికి ఫోన్ కాల్ చేశారు. 2019లో జానీ మాస్టర్ టీమ్‌లో సదరు యువతి అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా చేరింది. ఒక షో కోసం జానీ మాస్టర్‌తో పాటు మరో ఇదరితో కలిసి ముంబైకి వెళ్లినప్పుడు బస చేసిన హోటల్లో జానీ అత్యాచారానికి పాల్పడ్డాడని ఎఫ్ఐఆర్ ఉంది. ఈ విషయాన్ని బయట ఎవరికీ చెప్పవద్దంటూ బెదిరించారని యువతి తన ఫిర్యాదులో పేర్కొంది. షూటింగ్ సమయాల్లో అతడు చెప్పినట్టు వినకపోతే అసభ్యకరంగా ప్రవర్తించేవారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో యువతి పేర్కొంది. తరచూ తనపై జానీ మాస్టర్ అసభ్యకరంగా ప్రవర్తించేవాడని, లైంగిక వేధింపులకు పాల్పడేవాడని తెలిపింది. మతం మార్చుకొని తనను పెళ్లి చేసుకోవాలంటూ జానీ మాస్టర్ బలవంతం చేశారని ఆమె ఆరోపించింది. వీటికి ఒప్పుకోకపోవడంతో జుట్టు పట్టుకొని జానీ మాస్టర్ దాడి చేశారని తెలిపింది. ఫిర్యాదు చేసిన యువతి వయసు 21 సంవత్సరాలు. గత కొంత కాలంగా తనపై జానీ మాస్టర్ లైంగిక దాడులకు పాల్పడుతున్నాడని పేర్కొంది. కాగా ఘటన నార్సింగి పరిధిలో జరగడంతో కేసుని అక్కడికి బదిలీ చేశారు. ఔట్ డోర్ షూటింగులలో తనపై అత్యాచారం చేశాడని ఫిర్యాదులో యువతి పేర్కొంది. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కి కేసును బదిలీ చేశారు.

# వైసీపీ ప్రభుత్వంలో విద్యాశాఖ పూర్తిగా నిర్లక్ష్యం

- ఎక్స్ వేదికగా లోకేశ్ ఘాటు విమర్శలు

**అమరావతి, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** వైసీపీ ప్రభుత్వంలో విద్యాశాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మంత్రి నారా లోకేష్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డికి నారా లోకేష్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మాజీ సీఎం జగన్ అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడంలో జగన్ విఫలం అయ్యారని ఆరోపించారు. ఈ మేరకు ట్విట్టర్ లో మాజీ సీఎం జగన్ పై తీవ్ర విమర్శలు చేశారు. ఏం చదివావో తెలియదు.. ఎక్కడ చదివావో అస్సలు తెలియదు.. నువ్వు విద్యాశాఖ గురించి లెక్చర్ ఇవ్వడం వింతగా ఉంది. ఫేక్ జగన్! కనీస అవగాహన లేకుండా రాత్రి ఆత్మలతో మాట్లాడి ఉదయం.. మీరు తీసుకున్న నిర్ణయాలతో వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పాలిట శాపంగా మారింది. సీబీఎస్ఈ విధానంలో పరీక్షలు రాయడానికి అవసరమైన సామర్థ్య పెంపు, ఉపాధ్యాయులకు ఎలాంటి శిక్షణ ఇవ్వకుండానే పరీక్షా విధానం మార్చడంతో పదోతరగతి చదువుతున్న 75 వేల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని నారా లోకేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మలతో కాకుండా నిపుణులతో చర్చించి వచ్చే విద్య సంవత్సరం 6వ తరగతి నుంచే పరీక్షా విధానంలో మెల్లగా మార్పులు తీసుకొచ్చి సీబీఎస్ఈలో పరీక్షలు రాసేందుకు సిద్ధం చేస్తాం. గుడ్లు, చిక్కి, ఆఖరికి ఆయాల జీతాలు కూడా బకాయి పెట్టి పోయిన కంసమామ అయిన మీరు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చానని చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది. మీరు అంత ఉద్ధరిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గిందో సెలవివ్వండని నారా లోకేష్ ప్రశ్నల వర్షం కురిపించారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్పులు

- ఇక నుంచి ఛాంబర్ తొలగింపునకు నిర్ణయం
- స్వాగతిస్తున్న ప్రజలు

**అమరావతి, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** రాష్ట్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బ్రిటిష్ వారసత్వ రాచరిక వ్యవస్థకు సీఎం చంద్రబాబు ఆదేశాలతో స్వస్తి పలికారు. కార్యాలయాల్లో ఉండే ప్రత్యేక ఛాంబర్, రెయిలింగ్ వంటివన్నీ తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా జారీ చేసిన ఆదేశాలతో ఆదివారం నుంచే ఈ మార్పులు మొదలయ్యాయి. ఇప్పటివరకు పోడియం ఎత్తుగా, అక్కడ చెక్కలతో కూడిన రెయిలింగ్ ఉండేది. ఆ ఛాంబర్‌లోకి వెళ్లకుండా చిన్న తలుపు కూడా ఉండేది. అందులో సబ్‌రిజిస్ట్రార్ ఎత్తులో కూర్చునేవారు. క్రయ విక్రయాలకు వచ్చినవారు ఎవరైనా సరే.. సబ్‌రిజిస్ట్రార్ ముందు నిల్చొని ఉండాల్సిందే. ఇప్పుడిదంతా మారుస్తున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారుల మాదిరిగానే సబ్‌రిజిస్ట్రార్లు కూడా కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎత్తయిన కుర్చీ తొలగిస్తున్నారు. వారి ముందు సామాన్యులూ కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. క్రయ, విక్రయదారులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తే వారికి తాగునీరు అందించడంతో పాటు వీలైతే టీ, కాఫీ అందించాలని మెమోలో పేర్కొన్నారు. ఈ మేరకు విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడు తదితర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుకు తగ్గట్లు ఆదివారం మార్పులు చేశారు. సోమవారం సెలవు రోజు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా 290 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మార్పులు చేసి, మంగళవారం నాటికి స్నేహపూర్వక కార్యాలయాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా పనులు చేస్తున్నారు.

# చంద్రబాబు పట్టుదలతో సాధారణస్థితికి బెజవాడ

- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి ఆనం

**తిరుమల, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** సీఎం చంద్రబాబు పట్టుదలతో వరదలతో దెబ్బతిన్న విజయవాడ ప్రాంతంలో తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారిని వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన దర్శించుకున్నారు. తొలుత తితిదే అధికారులు ఆయన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆనం రామనారాయణరెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి సంపూర్ణ సహకారాలు అందించేలా స్వామివారు దీవెనలు ఇవ్వాలని కోరుకున్నట్లు మంత్రి తెలిపారు. ఐదేళ్లలో పంచాయతీరాజ్ వ్యవస్థను వైసీపీ నాశనం చేసిందని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దాన్ని 100 రోజుల్లో సరి చేశారన్నారు. రాష్ట్రంలో సంతృప్తికర పాలన చేస్తున్న చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌కు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని స్వామిని వేడుకున్నట్లు చెప్పారు. విజయవాడ వరదల్లో కుట్రకు పాల్పడిన వారికి స్వామి తగిన బుద్ధి చెప్తారన్నారు. మరోవైపు ప్రముఖ సినీ దర్శకుడు రాఘవేంద్రరావు, జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

# రావుల చెరువులో భారీ పేలుడు

- 14మందికి తీవ్ర గాయాలు

**అమలాపురం, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రావులచెరువు ప్రాంతంలో సోమవారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఈ ఘటన జరగ్గా.. పేలుడు ధాటికి రెండంతస్తుల భవ నం నేలమట్టం అయ్యింది. ఈ ప్రమాదంలో 14 మందికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలు స్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయ క చర్యలు చేపట్టారు. ఈ పేలుడుకు కారణం ముందు గ్యాస్ సిలెండర్ అని అనుకున్నా నిల్వ ఉంచిన బాణాసంచా సామగ్రి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఇంకా శిథి లాల కింద ఎవరైనా ఉన్నారా అని పరిశీలన చేస్తున్నారు. భవనంలో 150 కిలోల వరకూ బాణాసంచా తయారీకి ఉపయోగించే మందుగుండు రా మెటీరియల్ ఉందని సమా చారం. పేలుడు ధాటికి సమీపంలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యా రు. ఏం జరిగిందో తెలియని పరిస్థితుల్లో పరుగులు పెట్టారు.

# గంగమ్మ ఒడికి గణనాథుడు

- హుస్నాబాద్‌లో ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం







**హుస్నాబాద్,సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** గణప తి బొప్పా మోరి యా...ఆదా లడ్డూ కాలియా..అంటూ జనం నీరాజనం పలికారు. హుస్నా బాద్ పట్టణంలో తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణ నాథుడి నిమజ్జనోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా కొనసాగిం ది. డప్పు, చప్పుళ్లు, కోలాటాలు, యువకుల నృత్యాల మధ్య శోభాయాత్ర సాగింది. కేరింతలు కొడుతూ, రంగులు చల్లుకుంటూ యువకులు, చిన్నా రులు చిందులు వేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎల్లమ్మ చెరువు వద్ద గణనాథులకు నిమజ్జనం చేసి వినాయక సెలవిక అంటూ వీడ్కోలు పలి కారు.పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేసారు. నిమజ్జన మార్గ ంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుది ట్టమైన భద్రత ఏర్పాట్లు చేసారు.

## క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పూజలు



**భూపాలపల్లి,సెప్టెంబర్ 16(మనం న్యూస్) :** క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకునికి సోమవారం కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలను భక్తులు యంత్రాంగపు సలహాలు, సూచనలు పాటిస్తూ దిగ్విజయంగా జరుపుకున్నారని పేర్కొన్నారు.ఎలాంటి విఘ్నాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా 9 రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో దిగ్విజయంగా జరుపు కున్నారని హర్షం వ్యక్తం చేశారు. రెండు రోజుల పాటు జరగనున్న నిమజ్జన కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలు జిల్లా యంత్రాంగపు సలహాలు, సూచనలు పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీ లు ప్రదీప్, సంగీత్, క్యాంపు కార్యాలయ సిబ్బంది శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ ఒడికి గణేషుడు



**భూపాలపల్లి,సెప్టెంబర్ 16(మనం న్యూస్) :** గణపతి నవరాత్రుల సందర్భంగా విశేష పూజలందుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన గణనాథుడు సోమవారం మధ్యాహ్నం గంగమ్మ ఒడికి బయలుదేరాడు. పూజారి వినయ్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావ్ దంపతులు పాల్గొన్నారు. పూజల అనంతరం గణపయ్యను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో కాళేశ్వరం గోదావరి త్రివేణి సంగమానికి సాగనంపారు.

## జర్నలిస్టులకు మంచి రోజులు



**భూపాలపల్లి, సెప్టెంబర్ 16 (మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు మంచి రోజులు రాబోతున్నాయని, యే ళ్ళ నాటి శని వదిలిందని ,ప్రతీ జర్నలిస్ట్ తన హక్కులను సాకారం చేసుకోబోయే తరుణం మీడియా అకాడమి చైర్మెన్ కె శ్రీనివాస రెడ్డి ద్వారా ఆసన్నమయ్యే సమయం వచ్చేసిందని టియుడబ్ల్యూజె (ఐజే యు) జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ అన్నారు. హైదరాబాద్‌లోని దేశోద్ధారక భవన్‌లో జరిగిన టియుడబ్ల్యూజె (ఐజేయు) స్టేట్ ఎమర్జెన్సీ ఎక్స్టెండేడ్ ఎక్జిక్యూటివ్ కమిటిలో మీడియా అకాడమీ చైర్మేన్ శ్రీనివాసరెడ్డి కి జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కోనే సమస్యలైన. ఇళ్ళ స్థలాలు,అక్రిడేషన్,హెల్త్ కార్డుల గూర్చి వివరించగా,సాను కూలంగా స్పందించి అతీ త్వరలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హై దరాబాదులో జర్నలిస్ట్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేసి, తెలంగాణలో జర్నలిస్టులు ఎదుర్కోంటున్న అన్ని సమస్యలకి ఆ సభా వేదిక ద్వారానే శుభవార్త తెలియజేస్తానని చాలా సంతోష కరమైన వార్త తెలిపారని సతీష్ అన్నారు.

## రాజేందర్ మృతి పార్టీకి తీరని లోటు



**మహాదేవపూర్, సెప్టెంబర్ 16(మనం న్యూస్) :** మండల బి జె పి పార్టీ కార్యదర్శి మంతెన రాజేందర్ హఠాత్ మరణం పార్టీకి తీరని లోటని బిజెపి రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణ రెడ్డి అన్నారు ఆదివారం రాత్రి బిజెపి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం లో చురుగ్గా పాల్గొన్న రాజేందర్ ఒక్కసారిగా కుప్పకులడంతో పక్కనే ఉన్న సహచరులు హుటాహుటిన హాస్పిటల్ తరలించి నా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మంతెన రాజేందర్ పార్థివ దేహాన్ని నారాయణ రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం రాజేందర్ అంత్యక్రియల్లో భాగంగా అంతిమ యాత్రలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెప్పి, పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.అంతిమ యాత్రలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు స్నేహితులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న జెండా గణేశుడి నిమజ్జనం



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** నిత్య జనగణ మన కార్యక్రమ నిర్వహణ సంస్థ హైదరాబాద్‌లోని వందే ప్రజ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జెండా గణేషుడి నిమజ్జనం సోమవారం రాత్రి జరిగింది.పలువురిని విశేషంగా ఆకటుకున్న ఈ గణేషుడి నవరాత్రుల కార్యక్రమాలను ఆ సంస్థకు చెందిన లిటిల్ లీడర్స్ కే. లోకేష్, ఎన్.వి క్రాంత్, ఎమ్.చరణ్, బి. హర్షవర్ధన్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.


# ప్రజాపాలన వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి, సెప్టెంబర్ 16(మనం న్యూస్) :** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు రాకుండా మినిట్ టు మినిట్ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఐడిఓ సి కార్యాలయంలో నిర్వహించ నున్న వేడుకలకు మి న్గిట్ టు మినిట్ షెడ్యూల్ తయారు చేశామని, అట్టి షెడ్యూల్ ప్రకారం వేడుకలు నిర్వహణ జరిగేలా చూ డాలని అధికారులను ఆదేశించారు. ఇట్టి వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పోదెం వీరయ్యను ప్రభుత్వం నియమించిందని తెలిపారు. ఉదయం 10 గంటలకు ముఖ్య అతిథిచే జాతీ య పతాక ఆవిష్కరణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఉదయం 9 గంగలకు ఐడిఓసి కార్యాలయానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.కార్యక్రమ షెడ్యూల్‌ఉదయం 9.50 కి ఎస్పి కిరణ్ ఖరే ఐడిఓసి కార్యా లయానికి చేరుకుంటారు.ఉదయం 9.52 కి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఐడిఓసి కార్యాలయానికి చేరుకుంటారు.ఉదయం 9.55 కి ముఖ్య అతిథి రాష్ట్ర అటవీ అభివృ ద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య ఐడిఓసి కార్యాలయానికి చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు ముఖ్య అతిథి పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. తదుపరి జాతీ య పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం తెలంగాణ గీతాలాపన.10.10 గంటలకు ముఖ్య అతిథి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.10.30 గంటలకు జాతీయ గీ తాలాపన.10.33 గంటలకు కార్యక్రమం ముగింపు. ఉంటుందని తెలిపారు.

## ఘనంగా గణనాధుని నిమజ్జనం



**కాళేశ్వరం,సెప్టెంబర్ 16 (మనం న్యూస్) :** గంగమ్మ, గౌరమ్మల గారాల తనయుడు గం గమ్మ ఒడికి చేరుకున్నాడు. తొమ్మిది రోజుల పాటు అర్చక స్వాముల విశే ష పూజలు, భక్త జనుల నైవేద్యాలను అందుకున్న గణేశుడు సోమవారం గోదారమ్మ లో సేద తీరాడు. కాళేశ్వరం ప్రధాన ఆలయంలో చవితి నాడు కొలువు తీరిన బొజ్జయ్య తొమ్మిది రోజుల పూజల అనంతరం సోమవా రం మంగళ వాయిద్యాలు, మేల తా ళాలు, భక్త జనుల కోలాటాలు, మహి ళల మంగళ హారతుల నడుమ జోరు గా హుషారుగా ప్రధాన ఆలయం ను ంచి గోదావరి వరకు శోభాయాత్ర వై భవంగా జరిగింది. పవిత్ర త్రివేణి సం గమ గోదావరిలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ గంగమ్మ ఒడికి చేరుకున్నాడు.ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, పూజారులు నగేష్ శర్మ, పవన్ శర్మ , ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా లంభోదరుని నిమజ్జనం



**మహాదేవపూర్,సెప్టెంబర్ 16(మనం న్యూస్) :** గణపతి నవరాత్రుల సందర్భం గా నియమ నిష్టలతో తొమ్మిదిరోజులు గణనాదునికి నిత్య పూజలు నిర్వహించారు. గణపతి నవరాత్రులు ముగియడంతో చివరి రోజున సంగమం లో గణేష్ నిమజ్జనాన్ని భారీగా భక్తులు తరలి వెళ్లారు.మండలంలో ని మహాదేవపూర్, బొమ్మాపూర్, ఎలికే శ్వరం, బేగుళూర్, సూరారం, అంబట్ పల్లి రాపెల్లి కోట, తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాదుల మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు.అనంతరం తీర్థ ప్రసా దలను అందుకున్నారు.మండల కేంద్రంలోని వాసవీ నగర్ లో ఆర్య వైశ్య సంఘం, తస్సార్ కాలనిలో దేవాంగ సంఘం, చౌరస్తాలో గణేష్ యూత్, దుబ్బగూడెం, విజేత యూత్, రెడ్డి సంఘం వారు ఏర్పాటు చేసిన గణపతులకు పూజల అనంతరం అన్న దాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయా మండపాల వద్ద ఉట్టి కొట్టె కార్యక్రమం తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు,గణపతులను గోదావరినదిలో నిమజ్జనం చేయడానికి భక్తులు భారీగా కోలాట నృత్యల తో ఊరేగిపుగా తరలివెళ్లారు.

# నాపై హత్యాయత్నానికి కుట్ర

- రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆరోపణలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** తెలంగాణ కోసం చావడానికైనా సిద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని... తనపై జరిగిన దాడి తర్వాత పరిణామాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. తన హత్యకు కుట్ర జరుగుతుందన్న ఆయన.. తాము అధికారంలోకి వస్తే ఎవర్నీ విడిచి పెట్టేది లేదని వార్నింగ్ ఇచ్చారు. ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేయించానని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం చాలా దారుణమని అన్నారు. తెలంగాణ బీఆర్ఎస్ వర్సెస్ రేవంత్ రెడ్డి అన్నట్టు రాజకీయం నడుస్తోంది. కాంగ్రెస్ పార్టీ కంటే రేవంత్ రెడ్డిపైనే ఎక్కువ ఫోకస్ చేసి బీఆర్ఎస్ విమర్శలు చేస్తోంది. ఇప్పుడు ఏకంగా ఒక ఎమ్మెల్యేను చంపడానికే ఎలాన్ చేశారని తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు ఆ పార్టీ నేత కౌశిక్ రెడ్డి. దాదాపు వారం రోజు నుంచి సాగుతున్న హైడ్రామాలో మరోసారి కౌశిక్ రెడ్డి తీవ్ర కామెంట్స్ చేశారు. ఇది ఇప్పుడు మరోసారి తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయంశమయ్యాయి. కౌశిక్ రెడ్డి తన హత్య గురించే కాకుండా పీసీసీ చీఫ్ అయ్యేందుకు రేవంత్ రెడ్డి తన కాళ్లు పట్టుకున్నారని కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇలా రోజుకో రకంగా మాట్లాడుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారిపోతున్నారు. తెలంగాణ భవన్‌లో వివేక్‌తో కలిసి మీడియాతో మాట్లాడిన కౌశిక్ రెడ్డి తనను హత్య చేయడానికి మనుషులను పంపించినట్టు రేవంత్ రెడ్డే స్వయంగా ఒప్పుకున్నారని అన్నారు. దీనిపై డీజీపీ, హోంశాఖ సెక్రటరీ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు కాల్స్ చేసి చంపేస్తామని బెదిరిస్తున్నారని కౌశిక్ రెడ్డి ఆరోపించారు తనకు ఏమైనా జరిగితే దానికి రేవంత్ రెడ్డే బాధ్యుడు అవుతారని హెచ్చరించారు. వందల మంది పోలీసులు సహకారంతోనే తనపై దాడికి యత్నించారన్నారు. తాను తెలంగాణ కోసం చావడానికైనా సిద్ధమని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అప్పుడు ఒక్కొక్కరి సంగతి చూస్తామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి వీపు చింతపండు చేస్తారని ఆరోజులు దగ్గర్లోనే ఉందని అభిప్రాయపడ్డారు. పోలీసుల తీరుపై కూడా కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఖమ్మం వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్తానన్న అరెస్టు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నేతలు దాడులకు వచ్చినా వదిలేస్తున్నారని ఆరోపించారు. వీటిపై మాట్లాడాల్సిన మంత్రులు కూడా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. పార్టీ మారిన వారిపై వేటు ఖాయమని ఆ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రాబోతున్నాయని అందులో కూడా బీఆర్ఎస్ జెండా ఎగురుతుందని అన్నారు. అధికార మదంతో రేవంత్ రెడ్డి విర్రవీగుతున్నారని అన్నారు కౌశిక్ రెడ్డి. తన కాళ్లు మొక్కితేనే రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ అయ్యారని అన్నారు. ఓటు నోటు కేసులో రేవంత్ రెడ్డి వీపు చింతపండు అయిందన్నారు. అన్నింటిని మర్చిపోయి ఇప్పుడు కక్ష సాధింపులకు దిగుతున్నారని ఆరోపించారు. అన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని సరైన సమయంలో వాళ్లు రేవంత్‌కు బుద్ధి చెబుతారన్నారు.

## తెలంగాణ తల్లిని అవమానించిన కాంగ్రెస్

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** తెలంగాణకు సంబంధం లేని దివంగత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని రాష్ట్ర సచివాలయం ఎదుట పెట్టడం సిగ్గు మాలిన చర్య అని మాజీ మంత్రి, బీఆ ర్ఎస్ నేత వేముల ప్రశాంత్‌రెడ్డి విమ ర్శలు చేశారు. తెలంగాణ తల్లి విగ్ర హం ఉండాల్సిన చోట రాజీవ్ విగ్రహా న్నిపెట్టడం అంటే తెలంగాణ తల్లిని అవమానించడమేనని వేముల ప్రశాం త్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ బాసులకు ప్రసన్నం చేసుకోవడానికి.. తెలంగాణ ఆత్మను తాకట్టు పెట్టారని ఆరోపించారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆనాడే సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని భావించారని అ న్నారు. 2023 జూన్‌లో అందుకు సం బంధించిన ప్రణాళికలను సైతం సిద్ధం చేశారని గుర్తుచేశారు. సచివా లయానికి, అమరజ్యోతి మధ్య అనుసంధానంగా ఉండేలా కేసీఆర్ చేశారని చెప్పారు. కానీ రేవంత్ చర్యలు అందుకు విరుద్ధంగా ఉన్నాయని ధ్వజమెత్తారు. డైవర్ట్ పాలిటిక్స్‌లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇలాంటి పనులు చేస్తున్నారని వేముల ప్రశాం త్ రెడ్డి విమర్శలు చేశారు. రేవంత్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డా యని హెచ్చరించారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే తెలంగాణ తల్లి గౌర వం పెంచేలా తమ చర్యలు ఉంటా యని స్పష్టం చేశారు. అమర జ్యోతి కట్టి ఏడాది దాటినా రేవంత్ దాన్ని ఇంకా అందుబాటులోకి తీసుకు రావ డం లేదని అన్నారు. కేసీఆర్ కట్టిన స చివాలయంలోనే ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు కూర్చుం టున్నారని వేముల ప్రశాంత్ రెడ్డి గుర్తుచేశారు. కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో రివ్యూలు చేస్తున్నారని అన్నారు. కానీ కేసీఆర్ కట్టారన్న కారణంతో అమరజ్యోతిని సీఎం రే వంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని వి మర్శించారు.

# తెలంగాణలో విద్యావ్యవస్థ రోజురోజుకు పతనం



- సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
- సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** తెలంగాణలో విద్యావ్యవస్థ రోజు రోజుకు పతనమవుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతుందన్న మాటలకు అత్యంత ప్రాధాన్యమిచ్చిన కేసీఆర్ రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతానికి అనేక చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేశారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలనే ఆలోచనతో పెద్ద సంఖ్యలో గురుకులాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి ఆరోగ్యకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్యను అందించారు. కానీ 9 నెలల మీ పాలన వల్ల ప్రభుత్వ విద్యావ్యవస్థ పతనావస్థకు చేరుకున్నది. పురుగులు లేని భోజనం కోసం, పాము కాట్లు, ఎలుక కాట్లు లేని వసతి కోసం, కనీస సౌకర్యాల కల్పన కోసం తరగతి గదుల్లో ఉండాల్సిన విద్యార్థులు రోలడెక్కి నిరసనలు తెలియజేస్తున్నారు. ఒకవైపు టీచర్లు లేని కారణంగా బడులు మూతబడుతుంటే, మరోవైపు ప్రభుత్వ బడుల మీద విశ్వాసం సన్నగిల్లడంతో డ్రాపౌట్స్ పెరిగిపోతున్నాయి. మీ ప్రభుత్వ లెక్కలే ఈ వాస్తవాలను చెబుతున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ఒక్క విద్యార్థి లేని పాఠశాలలు 1864 ఉంటే, 30లోపు విద్యార్థులున్న పాఠశాలలు 9,447 ఉన్నాయి. వందలోపు విద్యార్థులు మాత్రమే ఉన్న పాఠశాలలు 9,609. అంటే మీ 9 నెలల మీ పాలనలో మొత్తం 26,287 ప్రభుత్వ పాఠశాలలకు గాను దాదాపు 20వేల పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. క గురుకులాల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. కేసీఆర్ గారి పాలనలో ఎవరెస్ట్ శిఖరమంత ఖ్యాతి గడించిన గురుకులాలు మీ పాలనలో సమస్యలకు నిలయాలుగా మారాయి. గురుకులాల దుస్థితి గురించి వార్తలు నిత్యకృత్యమైనా మీ ప్రభుత్వానికి పట్టింపులేదు. బిఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్లలో కృషి చేసి పటిష్టపరిచిన గురుకులాలను మీ ప్రభుత్వం 9 నెలల్లోనే ధ్వంసం చేసింది. సంక్షేమ హాస్టళ్లను, సంక్షోభ హాస్టళ్లుగా మార్చింది. పరిశుభ్రత లోపించి మురుగు, చెత్త చెదారంతో నిండి కంపు కొడుతున్నాయి. పాఠశాల నుంచి కళాశాల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇలా ఏ హాస్టల్ చూసినా దుర్భర పరిస్థితులే ఉన్నాయి. కుక్కకాటు, పాముకాటు, ఎలుక కాట్లతో విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నారు. ప్రతి రోజూ ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయి. ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు 715 మందికి పైగా విద్యార్థులు ఆస్పత్రుల పాలు కాగా, 40పైగా మంది ప్రాణాలు కోల్పోయారు. అత్యంత బాధాకరమైన విషయం ఇది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయం అంటూ పేర్కొన్నారు.

# దేశాన్ని విభజించే కుట్ర

## దేశంలో తొలి వందే మెట్రో రైలు ప్రారంభం

### మోదీ స్ఫురించేలా 'నమో భారత్'గా పేరు మార్పు

### ప్రారంభానికి కొన్ని గంటల ముందు మార్చిన రైల్వే



**గాంధీనగర్/అహ్మదాబాద్, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** దేశ సమైక్యతను, సమగ్రతను దెబ్బతీసి దేశ విభజన కుట్రకు కొంత మంది తెరలేపుతున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ధ్వజమెత్తారు. మనసు నిండా విద్వేషం, వ్యతిరేకత నిండిన ఈ వ్యక్తులు దేశంపై విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. భిన్నత్వం, వాణిజ్యం, సామర్థ్యం, పనితీరు, అవకాశాల్లో భారత్ అసమాన దేశమని, పెట్టుబడిదారులకు 21వ శతాబ్దంలో అత్యుత్తమ గమ్య స్థానమని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయని పేర్కొన్నారు. 21వ శతాబ్దాన్ని చరిత్రలో లిఖిస్తే అందులోని భారతీయ సౌర విప్లవం సువర్ణాక్షరాలతో ఉంటుందని స్పష్టం చేశారు. సోమవారం గుజరాత్‌లోని గాంధీనగర్‌లో పునరుత్పాదక ఇంధన పెట్టుబడిదారుల సదస్సుతోపాటు అహ్మదాబాద్లో వందే భారత్ రైళ్ల ప్రారంభం, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

### ఏ అవకాశాన్నీ వదులుకోని విద్వేషులు

దేశాన్ని అప్రతిష్ఠ పాలు చేయడంలో ఏ ఒక్క అవకాశాన్నీ విద్వేషులు వదులుకోవడం లేదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బుజ్జగింపు రాజకీయాల కోసం కొందరు పరిమితులన్నింటినీ దాటుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఇటీవల అమెరికాలో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ప్రధాని స్పందన ప్రాధాన్యం సంతరించుకుంది. పేరు ప్రస్తావించకుండానే ఆయన రాహుల్‌పై ధ్వజమెత్తారు. అహ్మదాబాద్లో రూ.8,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మోదీ శ్రీకారం చుట్టారు. తొలి వందే భారత్ మెట్రో అయిన.. భుజ్-అహ్మదాబాద్ నమో భారత్ ర్యాపిడ్ రైలును ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాలతోపాటు మిగిలిన రాష్ట్రాలకు కేటాయించిన 5 వందే భారత్ రైళ్లకు పచ్చజెండా ఊపారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. 'మూడో విడత 100 రోజుల పాలనలో ప్రతిపక్షాల నేతలు నన్ను అవమానించారు. అపహాస్యం చేశారు. నాపై దాడులకు దిగారు. అయితే అనుకున్న అభివృద్ధి లక్ష్యాల సాధనలో నేను ఏ మాత్రం వెనకడుగు వేయలేదు. ప్రతి ఒక్కరూ దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని చూస్తుంటే విద్వేషం నిండిన కొంత మంది సమైక్యతను దెబ్బతీయాలని కోరుకుంటున్నారు. దేశాన్ని ముక్కలు చేయాలని ప్రయత్నిస్తున్నారు. జమ్మూ కశ్మీర్లో ఆర్టికల్ 370ని మళ్లీ తేవాలని చూస్తున్నారు. రెండు రాజ్యాంగాలను అమలు చేయాలని ప్రయత్నిస్తున్నారు. ప్రతిపక్షాల నేతలు నన్ను అపహాస్యం చేస్తుంటే నేను మౌనంగా ఉండటం చూసి ప్రజలు ఆశ్చర్యపోయారు. అయితే దేశం కోసం నేను ఏ త్యాగానికైనా సిద్ధమే' అని ప్రధాని పేర్కొన్నారు. 'నేను జీవిస్తే.. మీ కోసమే జీవిస్తా.. నేను పోరాడినా అది మీ కోసమే. నేను త్యాగం చేసినా అదీ మీ కోసమే' అని స్పష్టం చేశారు.

### వెయ్యేళ్ల అభివృద్ధికి పునాది

రానున్న వెయ్యేళ్ల అభివృద్ధికి పునాది వేసేందుకు భారత్ సిద్ధమవుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అగ్ర స్థానానికి చేరడమే కాకుండా అక్కడే స్థిరపడేలా ప్రణాళికలు వేస్తున్నామని చెప్పారు. గాంధీనగర్లో జరిగిన నాలుగో అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధన పెట్టుబడిదారుల సదస్సు, ఎక్స్పోను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుసహా పలు రాష్ట్రాల నేతలు, ప్రతినిధులు పాల్గొన్నారు. సంప్రదాయ ఇంధన వనరులు లేని దేశంగా భారత్ ఉన్నప్పటికీ.. 2047 నాటికి సౌర, పవన, అణు, హైడ్రో విద్యుత్ రంగాల ద్వారా స్వయం సమృద్ధి సాధించే దిశగా పయనిస్తున్నామని ప్రధాని తన ప్రసంగంలో తెలిపారు. హరిత భవిష్యత్తు, నెట్ జీరో అనేవి మనకు ఫ్యాన్సీ పదాలు కాదని, మన అవసరాలని స్పష్టం చేశారు. వాటి సాధనకు కట్టుబడి ఉన్నామని చెప్పారు.

### 17 సౌర నగరాలు

అయోధ్యతోపాటు 17 నగరాలను సౌర నగరాలుగా అభివృద్ధి చేయాలని కృషి చేస్తున్నామని ప్రధాని తెలిపారు. ఈ నగరాల్లో ప్రతి ఇల్లు, కార్యాలయం, ప్రతి రంగమూ సౌర విద్యుత్తో నడిచేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. హరిత ఇంధనం కోసం రూ.7,000 కోట్లతో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామని, 31,000 మెగావాట్ల హైడ్రో ఇంధన ఉత్పత్తికి రూ.12,000 కోట్లతో లక్ష్యం నిర్దేశించుకున్నామని వెల్లడించారు. 12 పారిశ్రామిక నగరాలకు అనుమతించామని, 15 మేడ్ ఇన్ ఇండియా సెమీ హైస్పీడ్ వందే భారత్ రైళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. అహ్మదాబాద్, గాంధీనగర్ మెట్రో రైలు రెండో దశను ప్రధాని ప్రారంభించారు. గాంధీ నగర్ సెక్టార్ 1 స్టేషన్ నుంచి గిఫ్ట్ సిటీ వరకూ మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్, ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ పాల్గొన్నారు.



జూన్ 9వ తేదీన మూడోసారి ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టాక గుజరాత్లో పర్యటించడం ఇదే తొలిసారి. గాంధీనగర్లో ఇళ్లకు సౌర విద్యుత్ అందించే సూర్య ఘర్ లబ్ధిదారులతో మోదీ భేటీ అయ్యారు. గాంధీనగర్‌లోనే సోమనాథ్ ఆలయ ట్రస్టు సమావేశంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ ట్రస్టుకు మోదీ ఛైర్పర్సన్‌గా ఉన్నారు. ట్రస్టు సభ్యులైన ఎల్కే ఆడ్వాణీ, అమిత్ షా హాజరు కాలేదు.

### 'నమో..' భారత్

నరేంద్ర మోదీ! ఈ పేరు పొడి అక్షరాల్లో రాస్తే నమో! మోదీ పేరును స్ఫూరించే విధంగా ఓ రైలుకు పేరు పెట్టేసింది రైల్వేశాఖ. వాస్తవానికి గుజరాత్లోని భుజ్-అహ్మదాబాద్ మధ్య ప్రారంభించిన రైలుకు తొలుత అనుకున్న పేరు 'వందే మెట్రో'! సోమవారం ఈ రైలును ప్రారంభించే కొన్ని గంటల ముందు రైల్వేశాఖ పేరు మార్చేసింది. 'నమో భారత్ ర్యాపిడ్ రైలు' అని పేరు పెట్టింది. అహ్మదాబాద్ నుంచి ప్రధాని మోదీ వర్చువల్‌గా జెండా ఊపడంతో భుజ్ రైల్వే స్టేషన్ నుంచి సోమవారం 4:15 గంటలకు అహ్మదాబాద్ దిశగా ఈ రైలు పరుగుతీసింది. 'నమో భారత్ ర్యాపిడ్ రైలు' భుజ్-అహ్మదాబాద్ మధ్య తొమ్మిది స్టేషన్లను కవర్ చేస్తూ 5:45 గంటల్లో 359 కి.మీ దూరం ప్రయాణిస్తుంది. 12 బోగీల్లో 1,150 సీట్లుంటాయి.


### నమో భారత్ ర్యాపిడ్ రైలు.. ఇంటర్‌సిటీ బస్సుల కంటే ఛార్జీలు తక్కువే!

తక్కువ దూరంలో ఉన్న నగరాల మధ్య ప్రయాణ మార్గాన్ని మరింత సులభతరం చేసేందుకు 'నమో భారత్ ర్యాపిడ్ రైళ్ల 'ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గుజరాత్‌లోని భుజ్-అహ్మదాబాద్ల మధ్య తొలి రైలును ప్రధాని మోదీ ప్రారంభించారు. అయితే, వీటిలో ఛార్జీలు తక్కువని రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఈ మార్గంలో ప్రయాణించే ఏసీ, నాన్-ఏసీ బస్సుల కంటే నమో భారత్ ర్యాపిడ్ రైలు టికెట్ ధరలే తక్కువని స్పష్టం చేసింది. 'భుజ్ నుంచి గాంధీ ధామ్ ఏసీ బస్సు టికెట్ ధర రూ.140 కాగా నాన్-ఏసీ బస్సు రూ.110గా ఉంది. వీటితో పోలిస్తే వందే మెట్రో ఏసీ రైలు టికెట్ ధర రూ.75 మాత్రమే. భుజ్ నుంచి గాంధీధామ్‌కు బస్సు ప్రయాణానికి రెండు గంటలు పడితే నమో భారత్ ర్యాపిడ్ రైల్లో కేవలం 55 నిమిషాల్లోనే చేరుకోవచ్చు' అని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

---

# దీర్ఘకాల పెట్టుబడులకు ఎన్‌పీఎస్ వాత్సల్య

### రేపు ప్రారంభించనున్న నిర్మలమ్మ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** తమ పిల్లల భవిష్యత్ కోసం దీర్ఘకాలం పెట్టుబడి పెట్టాలనుకునే వారికోసం బడ్జెట్‌లో ప్రకటించిన ఎన్‌పీఎస్ వాత్సల్యను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రేపు ప్రారంభించనున్నారు. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి, ఆర్థిక శాఖ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని సమాచారం. పథకం ప్రారంభంతో పాటు విధివిధానాలు తెలియజేయనున్నారు. 18 ఏళ్లలోపు బాలబాలికల పేరుతో తల్లిదండ్రులు/సంరక్షకులు ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతా తీసుకోవచ్చు. పిల్లలు మేజర్లు అయ్యాక ఈ ఖాతా సాధారణ ఎన్‌పీఎస్ (ఔఖా) ఖాతాగా మారుతుందని జులైలో ప్రకటించిన బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. దేశంలోని ప్రజలందరికీ సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో 2004లో తీసుకొచ్చిన ఎన్‌పీఎస్.. పన్ను ప్రయోజనాలతో పాటు, దీర్ఘకాలిక పెట్టుబడి పథకంగా బాగా ప్రాచుర్యం పొందింది. దీన్ని ఇప్పుడు మరింత విస్తృత పరుస్తూ మైనర్లకూ వాత్సల్యను అందుబాటులోకి తేవడం గమనార్హం. సుకన్య సమృద్ధి యోజన, పీపీఎఫ్ వంటి మదుపు పథకాలకు ఇది అదనం. ఎన్‌పీఎస్ వాత్సల్య వల్ల ముందుగానే పెట్టుబడులు ప్రారంభించడానికి వీలు పడుతుంది. దీనివల్ల చక్రవడ్డీ ప్రయోజనాన్ని పొందే అవకాశం ఉంటుంది. మైనర్లుగా ఉన్నప్పుడే ఎన్‌పీఎస్ ఖాతా తెరవడం వల్ల రిటైర్మెంట్ నాటికి పెద్ద మొత్తంలో కార్పస్ సమకూరుతుంది. ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతా వల్ల చిన్నతనంనుంచే తమ పిల్లలకు నుంచే పొదుపు అలవాటు చేయొచ్చు. సాధారణంగా ఎన్‌పీఎస్‌లో టైర్1, టైర్2 ఖాతాలుంటాయి. టైర్1 ప్రాథమిక పింఛను ఖాతా. ఇందులో చేరినప్పుడు ఉపసంహరణలపై కొన్ని పరిమితులు ఉంటాయి. టైర్2లో స్వచ్ఛంద పొదుపు పథకంలాంటిది. ఎన్‌పీఎస్‌లో పెట్టుబడిపై సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద రూ.50,000 వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది. ఇది సెక్షన్ 80సీ పరిమితి రూ.1,50,000కు అదనం. పదవీ విరమణ తర్వాత (60 ఏళ్లు) ఎన్‌పీఎస్ నిధిలో 60 శాతాన్ని ఒకేసారి వెనక్కి తీసుకోవచ్చు. మిగతా 40 శాతంతో తప్పనిసరిగా యాన్యుటీ పథకాలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీని ద్వారా పదవీ విరమణ తర్వాత పింఛను పొందేందుకు వీలవుతుంది.

---

# ఉగ్రవాదాన్ని పాతిపెడతాం

### ఇంకెవ్వరూ దానికి పునరుజ్జీవం కల్పించలేరు

### జమ్మూకశ్మీర్‌లో ఎన్నికల ప్రచారంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్య

**గులాబ్‌గఢ్/కిష్త్వార్, సెప్టెంబర్ 16 (మనం న్యూస్):** మళ్లీ కోలుకోనంతగా ఉగ్రవాదాన్ని బీజేపీ ప్రభుత్వం పాతాళంలోకి పాతిపెట్టనుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలోని పెదర్-నగ్‌సేని నియోజకవర్గ పరిధిలో సోమవారం గులాబ్‌గఢ్‌లో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో అమిత్ ప్రసంగించారు. '1990దశకం నుంచి ఉగ్రవాదంతో కష్టాలుపడుతున్న జమ్మూ కశ్మీర్ ప్రజలకు ఈరోజు మాట ఇస్తున్నా. మళ్లీ ఈ గడ్డపై కనిపించనంత లోతుల్లో ఉగ్రవాదాన్ని మా ప్రభుత్వం పాతిపెడుతుంది. ఇక్కడ తమ ప్రభుత్వం ఏర్పాటైతే జైళ్ల నుంచి ఉగ్రవాదులను విడుదలచేస్తామని నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ) కాంగ్రెస్ పార్టీలు హామీ ఇచ్చాయి. మచియాల్ మాత సాక్షిగా చెబుతున్నా. భారతగడ్డపై ఉగ్రవాదాన్ని వ్యాప్తిచేసే సాహసం ఇంకెవ్వరూ చేయరు. ఉగ్రవాదులను ఎదుర్కొనేందుకు గ్రామ రక్షణ గార్డులు, స్పెషల్ పోలీస్ అధికారులకు పాతరకం .303 రైఫిళ్ల స్థానంలో అధునాతన ఆయుధాలిచ్చాం. ఎక్కడి నుంచైనా ఇక్కడికి ఉగ్రవాదులొస్తే వారి కథ ఇక్కడి మంచుకొండల్లో ముగిసిపోతుంది'' అని అన్నారు. ఈ సందర్భంగా ఎన్సీ, కాంగ్రెస్లపై అమిత్ విమర్శలు చేశారు. 'డోగ్రాల చివరి రాజు మహారాజా హరిసింగ్ను వీళ్లు అవమానించారు. కశ్మీరీ పండిట్లు బలవంతంగా వెళ్లిపోవడానికి కారణం వీళ్లే. వీళ్లు మహిళ హక్కులను లాగేసుకున్నారు. అవసరమైన వర్గాలకు రిజర్వేషన్ ఫలాలు దక్కకుండా చేశారు'' అని ఆరోపించారు. 'రువ్వేందుకు రాళ్లు పట్టుకున్న యువతకు జైళ్లు సిద్ధంగా ఉన్నాయి. అలాగే ల్యాప్‌టాప్‌లు, త్రివర్ణపతాకం పట్టుకున్న యువతకు ఉద్యోగాలు సిద్ధంగా ఉన్నాయి' అని షా అన్నారు.



### రాహుల్ కశ్మీర్‌లో ఐస్క్రీమ్ తినొచ్చు

రామ్‌బాన్‌లో జరిగిన ర్యాలీలోనూ అమిత్ మాట్లాడారు. 'కశ్మీర్‌ను ఎన్డీఏ సర్కార్ సురక్షితమైన ప్రాంతంగా మార్చేసింది. అయితే ఇటీవల రాహుల్ ఇక్కడి కొచ్చి లాల్‌చౌక్ ఐస్క్రీమ్ తిన్నారు. బైక్ నడిపారు. పైగా మా ప్రభుత్వాన్నే విమర్శిస్తున్నారు. రాహుల్ బాబా.. మీరు మమ్మల్ని విమర్శిస్తున్నారుగానీ ఇంతటి రక్షణ వాతావరణం మా వల్లే సాధ్యమైంది. మీ ప్రభుత్వాల్లో ఇది అసాధ్యం' అని అన్నారు. కాంగ్రెస్ హయాంలో హోం మంత్రిగా ఉండి కూడా లాల్‌చౌక్ ప్రాంతానికి వెళ్లాలంటేనే భయపడేవాడినని కాంగ్రెస్ నేత సుశీల్‌కుమార్ షిండే చేసిన వ్యాఖ్యలను అమిత్ గుర్తుచేశారు. 'షిండే గారూ.. ఇప్పుడు పిల్లాజెల్లాతో వచ్చేయండి. ఎంచక్కా లాల్‌చౌక్‌లో వాకింగ్ చేయండి. మీకు హాని చేసేందుకు ఎవరూ సాహసించరు'' అని అమిత్ అన్నారు.

---

# అన్నా హజారే పట్ల బాధగా ఉంది

### కేజ్రీవాల్ తీరును ఉటంకిస్తూ కిరణ్ రిజిజు పోస్ట్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 :** ప్రముఖ సామాజిక కార్యకర్త, అవినీతి వ్యతిరేక ఉద్యమ నేత అన్నా హజారే పట్ల బాధగా ఉందని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. ఢిల్లీ సీఎంగా అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో మంత్రి ఎక్స్ వేదికగా స్పందించారు. అన్నాహజా విషయంలో చింతిస్తున్నాం. ఆయన కంటే కూడా ఢిల్లీ ప్రజలకే ఎక్కువ నష్టం జరిగింది. కొంతవరకు ఆ ప్రభావం దేశ ప్రజలపై కూడా ఉంది. అలాగే అరాచకం, అవినీతి.. ధర్మాలుగా మారతాయని మేం ఎన్నడూ అనుకోలేదు' అని రిజిజు పోస్టు పెట్టారు. హజారే గతంలో మీడియాతో మట్లాడిన వీడియోను కూడా జోడించారు. 'రాజకీయాల్లో చేరొద్దని నేను కేజ్రీవాల్ కు సూచించాను. సామాజిక సేవలోనే విజయం ఉంటుందని చెప్పాను. కానీ ఆయన నా మాట వినలేదు. ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన కేసులో కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం బాధగా ఉంది. ఒకప్పుడు అవినీతిపై పోరాటంలో నా సహచరుడు.. ఇప్పుడు అవినీతి కేసులోనే అరెస్టు కావడం విడ్డూరంగా ఉంది. 'జన్‌లోక్‌పాల్' రాజకీయ ప్రత్యామ్నాయం విఫలం కావడం దురదృష్టకరం. రాజకీయ ఆకాంక్షల వల్లే అవినీతి వ్యతిరేక ఉద్యమం నాశనమైంది' అని కేజ్రీవాల్ అరెస్టు, మద్యపాలసీ గురించి ఆయన వ్యాఖ్యలు చేశారు. మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన కేజ్రీవాల్ ఇటీవలే రెగ్యులర్ బెయిల్‌పై బయటకు వచ్చిన సంగతి తెలిసిందే. ఇంతలోనే సీఎం పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం సంచలన ప్రకటన చేశారు. ప్రజలు తనకు క్లీన్ సర్టిఫికెట్ ఇచ్చేంత వరకూ ముఖ్యమంత్రి పదవిలో ఉండబోనని స్పష్టం చేశారు. రెండు రోజుల తర్వాత దిగిపోయి.. మధ్యంతర ఎన్నికలకు వెళ్లి ప్రజల్లో తన విశ్వసనీయతను పరీక్షించుకుంటానని ప్రకటించారు. దీంతో ఎన్నికలు జరిగేవరకు కొత్త ముఖ్యమంత్రిగా ఎవరు ఎంపికవుతారనే దానిపై ఆసక్తి నెలకొంది.

---

## మహిళా సాధికారతే దేశానికి బలం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 :** దేశంలో మహిళల సాధికారతే ఆ దేశానికి నిజమైన బలమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఏ ప్రాంతంలో అయినా, ఎలాంటి సమయంలోనైనా మహిళలు అభద్రతకు లోనవకుండా, వారి పట్ల గౌరవం చూపేలా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మన దేశంలో మహిళల గౌరవాన్ని, గౌరవాన్ని కాపాడతామని, వారి పురోభివృద్ధికి కృషి చేస్తామని ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఓ వార్తా సంస్థ సోమవారం నిర్వహించిన షిశక్తి సమ్మిట్-2024లో రాష్ట్రపతి మాట్లాడుతూ దేశంలో మహిళల భద్రతకోసం కఠినమైన చట్టాలను తీసుకొచ్చామన్నారు. అయినప్పటికీ అభద్రతా భావం కొనసాగుతుండటం దురదృష్టకరమని, మహిళలను బలహీనులుగా భావించే సామాజిక సంకుచిత మనస్తత్వం, ఛాందసవాదానికి వ్యతిరేకంగా నిరంతర పోరాటాలు చేయాల్సిన అవసరముందని ఆమె నొక్కి చెప్పారు. సమాజంలో ఎన్ని మార్పులొచ్చినా కొన్ని సామాజిక దురభిప్రాయాలు లోతుగా పాతుకుపోయాయని, ఇవి మహిళా సమానత్వానికి అవరోధాలను సృష్టిస్తున్నాయని తెలిపారు. ''ఎక్కడ తప్పు చేశాం? మెరుగుపడటానికి మనం ఏమి చేయాలి?''అని మహిళలు నిరంతరం ప్రశ్నించుకోవాలని సూచించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా శక్తి, ధైర్యసాహసాలు ప్రదర్శిస్తున్నారని మహిళలను కొనియాడారు.

### పితృస్వామిక దృక్పథాన్ని విడనాడాలి: సీజేఐ

చట్టం మాత్రమే న్యాయమైన వ్యవస్థను తయారు చేయలేదని, సమాజం మహిళల పట్ల తన మైండ్సెట్ను మార్చుకోవాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సోమవారం నొక్కి చెప్పారు. ప్రతిఒక్కరూ పితృస్వామిక దృక్పథాన్ని విడనాడాలని సూచించారు. మహిళల ప్రయోజనాలను పరిరక్షించడానికి విధానపరమైన, చట్టపరమైన నిబంధనలు అనేకం ఉన్నాయని, కానీ కఠినమైన చట్టాలే సమ సమాజాన్ని నిర్మించలేవన్నారు. మహిళలకు రాయితీలు ఇవ్వడం నుంచి స్వేచ్ఛగా, సమానంగా జీవించే హక్కు వారికుందనే విషయాన్ని గుర్తించే దిశగా మన మనస్తత్వాలు మార్చుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల హక్కుల గురించి మాట్లాడటమంటే మొత్తం సమాజం మార్పు గురించి మాట్లాడినట్లని వ్యాఖ్యానించారు. నా జీవితంలోని కొన్ని గొప్ప పాఠాలను మహిళా సహోద్యోగుల నుంచే నేర్చుకున్నానని, మెరుగైన సమాజానికి మహిళల సమాన భాగస్వామ్యం ముఖ్యమని తాను నమ్ముతానని చెప్పారు. దేశం రాజ్యాంగాన్ని ఆమోదించక ముందే ఇండియన్ ఉమెన్స్ చార్టర్ ఆఫ్ లైఫ్‌ను స్త్రీవాది అయిన హంసా మెహతా రూపొందించారని సీజే గుర్తు చేశారు.

## జమిలి ఎన్నికల నిర్వహణ అసాధ్యం

### మాజీమంత్రి చిదంబరం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 :** జమిలి ఎన్నికలు అసాధ్యమని, ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధ్యం కావని మాజీకేంద్రమంత్రి చిదంబరం వ్యాఖ్యానించారు. మూడోసారి కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే 'జమిలి' ఎన్నికలు మొదలవుతాయంటూ జరుగుతున్న ప్రచారంపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరం కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పట్లో 'ఒకే దేశం ఒకే ఎన్నికల' అమలు అసాధ్యమని మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ప్రస్తుత రాజ్యాంగ ప్రకారం దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే కనీసం ఐదు సవరణలైనా చేయాల్సి ఉంటుందని చిదంబరం అన్నారు. రాజ్యాంగ సవరణలను లోక్‌సభలో కానీ, రాజ్యసభలో కానీ ప్రవేశపెట్టేందుకు తగినంత సంఖ్యాబలం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వద్ద లేదని అన్నారు. 'ఒకే దేశం ఒకే ఎన్నికలు' ప్రతిపాదనను ఇండియా కూటమి పూర్తిగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఒకే దేశం ఒకే ఎన్నికలు' ప్రతిపాదన బీజేపీ లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో కీలకంగా ఉంది. గత నెల స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంలోనూ ప్రధానమంత్రి మోదీ ఈ అంశాన్ని ప్రస్తావించారు. తరచు జరిగే ఎన్నికలు దేశ ప్రగతికి అవరోధ మవుతాయని అన్నారు. జమిలి ఎన్నికలు ఇప్పటి అవసరమని స్పష్టం చేశారు.

మనం



# ఫైనల్‌కు భారత్

## హర్మన్‌ప్రీత్‌సింగ్ కెప్టెన్సీ షో
## సెమీస్లో దక్షిణ కొరియాపై ఘన విజయం
## తుదిపోరులో చైనాతో అమీతుమీ
## పాక్‌కు చైనా షాక్



ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ చాంపియన్గా బరిలోకి దిగిన భారత జట్టు జైత్రయాత్ర అప్రతిహాతంగా కొనసాగుతోంది. ఇప్పటిదాకా టోర్నీలో ఓటమన్నదే లేకుండా సెమీస్ చేరిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేన.. సోమవారం జరిగిన రెండో సెమీస్‌లో దక్షిణ కొరియాను చిత్తుచేసి వరుసగా రెండోసారి, ఈ టోర్నీలో ఆరోసారి ఫైనల్ చేరింది. భారత హాకీ అభిమానులు ముద్దుగా పిలుచుకునే 'సర్పంచ్ సాబ్' (కెప్టెన్ హర్మన్‌ప్రీత్) రెండు గోల్స్‌తో అదరగొట్టగా ఉత్తమ్ సింగ్, జర్మన్‌ప్రీత్ సింగ్ తలా ఓ గోల్ కొట్టారు. ఈ విజయంతో భారత్ మంగళవారం జరిగే ఫైనల్లో ఆతిథ్య చైనాతో అమీతుమీ తేల్చుకోనుంది. తొలి సెమీస్లో చైనా.. మాజీ చాంపియన్ పాకిస్థాన్‌ను ఓడించి ఈ టోర్నీలో తొలిసారి ఫైనల్ చేరింది. హులున్బుయిర్ (చైనా): భారత హాకీ జట్టు మరోసారి అద్భుత ప్రదర్శనతో ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లోకి ప్రవేశించింది. సోమవారం హులున్బుయిర్ వేదికగా జరిగిన రెండో సెమీస్లో భారత్.. 4–1తో దక్షిణ కొరియాను ఓడించి వరుసగా రెండోసారి ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఈ టోర్నీలో ఓటమన్నదే లేకుండా సాగుతున్న 'మెన్ ఇన్ బ్లూ'.. సెమీస్లో అదే దూకుడుతో ఆడింది. ఇది వరకే లీగ్ దశలో దక్షిణ కొరియాను చిత్తు చేసిన మన కుర్రాళ్లు సెమీస్లోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేశారు. భారత్ తరపున ఉత్తమ్ సింగ్ (13వ నిమిషంలో), జర్మన్‌ప్రీత్ సింగ్ (32) తలా ఓ గోల్ చేయగా సారథి హర్మన్‌ప్రీత్ సింగ్ (19, 45) రెండు పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలిచి తిరుగులేని ఆధిక్యాన్ని అందించాడు. ప్రత్యర్థి జట్టు తరపున యంగ్ జిహున్ (33) ఒక్కడే గోల్ కొట్టగలిగాడు.

### ఆది నుంచే దూకుడు..

ఆట ఆరంభం అయిన కొద్దిసేపటికే తొలి క్వార్టర్ 13వ నిమిషంలోనే అరెజీత్ సింగ్ అందించిన బంతిని నేరుగా గోల్ పోస్ట్‌లోకి పంపి భారత్‌కు తొలి గోల్ అందించాడు. తొలి క్వార్టర్ ముగిసిన వెంటనే కొరియాకు రెండు పెనాల్టీ కార్నర్ అవకాశాలు వచ్చినా వాటిని వినియోగించుకోవడంలో ఆ జట్టు సఫలీకృతం కాలేదు. కానీ 19వ నిమిషంలో భారత్కు వచ్చిన అవకాశాన్ని మాత్రం సర్పంచ్ సాబ్ వృథా చేయలేదు. ఆట అర్ధ భాగం ముగిసేసరికి 2–0 ఆధిక్యంలో ఉన్న భారత్.. తర్వాత కూడా అదే జోరును కొనసాగించింది. 32వ నిమిషంలో ఔట్ సైడ్ సర్కిల్ నుంచి బంతిని తన అధీనంలో ఉంచుకుంటూ జర్మన్‌ప్రీత్ సూపర్ గోల్ కొట్టాడు. కానీ ఆ మరుసటి నిమిషానికే వచ్చిన పెనాల్టీ కార్నర్ను జిహున్ గోల్గా మలవడంతో కొరియా బోణీ కొట్టింది. 45వ నిమిషంలో హర్మన్‌ప్రీత్ మరో పెనాల్టీ కార్నర్ గోల్ సాధించాడు. ఈ టోర్నీలో అతడికి ఇది 7వ గోల్. ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పైకి దండెత్తడంతో పాటు కొరియన్ల గోల్ ప్రయత్నాలను అడ్డుకోవడంలో మన డిఫెన్స్ శ్రేణి విజయవంతమైంది.

### పాక్కు షాక్..

తొలి సెమీస్‌లో చైనా.. మాజీ చాంపియన్ పాకిస్థానుకు ఊహించని షాకిచ్చింది. ఆట నిర్దేశిత సమయంలో ఇరు జట్లూ తలా ఓ గోల్ (1–1)తో సమానంగా నిలువడంతో మ్యాచ్ పెనాల్టీ షూట్‌అవుట్‌కు దారితీసింది. షూటౌట్‌లో చైనా 2–0తో గెలిచి ఈ టోర్నీలో తొలిసారి ఫైనల్స్‌కు అర్హత సాధించింది.

# బంగ్లాదేశ్‌తో సిరీస్ రద్దు చేయండి

- హిందూ జనజాగృతి సమితి డిమాండ్





మూడు రోజులైతే సొంతగడ్డపై బంగ్లాదేశ్‌తో రెండు టెస్టుల సిరీస్. ఇప్పటికే ఇరు జట్ల ఆటగాళ్లు చెపాక్ స్టేడియంలో నెట్స్ ప్రాక్టీస్‌లో మునిగితేలుతున్నారు. తొలి టెస్టు ఏర్పాట్లలో తలమునకలై ఉన్న భారత క్రికెట్ నియంత్రణ మండలికి అంతలోనే ఊహించని షాక్. బంగ్లాదేశ్‌తో సిరీస్ రద్దు చేయాలంటూ డిమాండ్లు వస్తున్నాయి. బంగ్లాదేశ్‌లోని హిందువులపై దాడులు ఆగేంత వరకూ ఆ దేశంతో సిరీస్ ఆడొద్దని హిందూ జనజాగృతి సమితిసభ్యులు పట్టుబట్టారు. అంతేకాదు వాంఖడే స్టేడియం అధికారులకు వినతి పత్రం సమర్పించారు. నెల క్రితం బంగ్లాదేశ్‌లో ఎంతో మంది హిందువులపై హత్యాకాండకు నిరసనగా ఈ డిమాండ్ చేసినట్టు హిందూ జనజాగృతి సభ్యులు తెలిపారు. ముంబైలోని వాంఖడే స్టేడియానికి సోమవారం హిందూ జనజాగృతి సమితి సభ్యులు వచ్చారు. బంగ్లాదేశ్‌తో టెస్టు, టీ20 సిరీస్లు రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. 'బంగ్లాదేశ్‌లో మైనార్టీలలైన హిందువులను అక్కడి జిహాదీలు నడిరోడ్డు మీదే చంపేస్తున్నారు. హిందువుల ఇండ్లను తగులబెడుతున్నారు. అంతేకాదు గుళ్లను ధ్వంసం చేస్తున్నారు. హిందూ మహిళలపై అత్యాచారాలకు తెగబడుతున్నారు. ఈ పరిస్థితుల్లో బంగ్లాదేశ్ జట్టుతో క్రికెట్ ఎలా ఆడుతాం?' అని హిందూ జనజాగృతి సమితి సభ్యులు వాంఖడే అధికారులను ప్రశ్నించారు. అయితే.. బీసీసీఐ మాత్రం ఈ విషయంపై స్పందించలేదు. భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య సెప్టెంబర్ 19వ తేదీన తొలి టెస్టు జరుగనుంది.

### బంగ్లాదేశ్‌లో హింసాత్మక దృశ్యాలు

రిజర్వేషన్ కోటాకు వ్యతిరేక ఆందోళనలతో నెల క్రితం బంగ్లాదేశ్ అట్టుడుకి పోయింది. అల్లరిమూకలు పెట్రేగిపోయి యథేచ్ఛగా హిందువులతో పాటు ముఖ్యంగా అప్పటి ప్రధాని షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్ మద్దతుదారులపై దాడులు చేశారు. దొరికినవాళ్లను దొరికనట్టు చంపేశారు. వాళ్ల ఇండ్లు, దుకాణాలు పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ హింసాకాండకు నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహ్మద్ యూనుస్ తాత్కాలిక ప్రభుత్వం తెరదించింది. అప్పటికే బంగ్లాదేశ్‌లోని మైనార్టీలకు జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

# అందుకే జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్‌ను తప్పిస్తున్నాం

సుమారు 40 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత టీమిండియా తిరిగి బరిలోకి దిగుతోంది. సొంతగడ్డపై బంగ్లాదేశ్‌తో రెండు టెస్టులు, మూడు టీ20ల సిరీస్ ఆడనుంది. చెన్నై వేదికగా సెప్టెంబర్ 19 నుంచి తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఈ మ్యాచ్ కోసం రోహిత్ శర్మ సారథ్యంలోని 16 మంది సభ్యులతో కూడిన భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. ఇప్పటికే భారత ఆటగాళ్లు చెన్నై వేదికగా ప్రాక్టీస్ కూడా ప్రారంభించారు. తొలి టెస్ట్ విజయమే లక్ష్యంగా సన్నదమవుతున్నారు. నయా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సారథ్యంలోని టీమిండియా మేనేజ్మెంట్ ఈ మ్యాచ్ గెలవడానికి కావాల్సిన వ్యూహాలు రచిస్తోంది. బీసీసీఐ మాత్రం కాన్పూర్ వేదికగా సెప్టెంబర్ 27 నుంచి జరిగే రెండో టెస్టుకు, అక్టోబర్ 6 నుంచి మొదలయ్యే టీ20 సిరీస్కు ఒకేసారి భారత జట్లను ప్రకటించాలని యోచిస్తోంది. అయితే బంగ్లాదేశ్తో టీ20 సిరీస్‌కు స్టార్ పేసర్లు జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్లకు విశ్రాంతి ఇవ్వాలని భారత సెలెక్టర్లు నిర్ణయించినట్లు తెలుస్తోంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సూచనల నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. వచ్చే నాలుగు నెలల్లో టీమిండియా 10 టెస్ట్ మ్యాచ్లు ఆడనుంది. వచ్చే ఏడాది ఏకంగా 16 టెస్ట్ మ్యాచ్లు ఆడాల్సి ఉంది. ఈ క్రమంలోనే జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్లను టీ20 ఫార్మాట్కు దూరంగా ఉంచాలని గంభీర్ భావిస్తున్నాడట. ఛాంపియన్స్ ట్రోఫీ ముందు వరకు వారిని టెస్ట్ ఫార్మాట్కు పరిమితం చేయాలని, వారి స్థానాల్లో కుర్రాళ్లకు అవకాశాలు ఇవ్వాలని సెలెక్టర్లకు సూచించినట్లు తెలుస్తోంది. టీ20 ప్రపంచకప్ విజయానంతరం జస్ప్రీత్ బుమ్రా ఇంటికే పరిమితమయ్యాడు. మరోవైపు సిరాజ్.. శ్రీలంక పర్యటనలో వన్డే సిరీస్ ఆడాడు. బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్ అనంతరం భారత్ న్యూజిలాండ్‌తో పాటు ఆస్ట్రేలియా గడ్డపై టెస్ట్ మ్యాచ్లు ఆడనుంది. ఈ సిరీస్‌లకు సిరాజ్, బుమ్రాలను ఫ్రెష్‌గా ఉంచేందుకు వారిని టీ20 సిరీస్‌లకు దూరంగా ఉంచాలని నిర్ణయించారని టీమ్ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు యువ ఓపెనర్ శుభ్మన్ గిల్ కూడా బంగ్లా దేశ్‌తో టీ20 సిరీస్‌కు దూరంగా ఉంచాలని టీమిండియా మేనేజ్మెంట్ భావిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. బంగ్లాదేశ్ టీ20 సిరీస్‌కు గిల్‌తో పాటు జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్లకు కూడా విశ్రాంతి ఇవ్వనున్నట్లు ఓ బీసీసీఐ అధికారి మీడియాకు తెలిపాడు. ఈ ముగ్గురితో పాటు రిషభ్ పంత్‌కు కూడా రెస్ట్ ఇచ్చే ఛాన్స్ ఉంది. ఒకవేళ పంత్‌కు విశ్రాంతి ఇస్తే ఇషాన్ కిషన్ తిరిగి భారత జట్టులోకి వస్తాడు. 'బంగ్లాదేశ్తో టీ20 సిరీస్కు శుభ్మన్ గిల్కు విశ్రాంతి ఇస్తున్నాం. ఇందుకు భారత్–బంగ్లాదేశ్ టీ20 సిరీస్ షెడ్యూలే కారణం.

అక్టోబర్ 7న గ్వాలియర్లో, 10న ఢిల్లీలో, 13న హైదరాబాద్లో మ్యాచ్లు ఉన్నాయి. మరో మూడు రోజుల వ్యవధిలోనే అక్టోబర్ 16 నుంచి న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. కాబట్టి శుభ్మన్ గిల్తో పాటు ప్రధాన ఆటగాళ్లందరికి విశ్రాంతి ఇవ్వడం చాలా ముఖ్యం' అని ఓ బీసీసీఐ అధికారి తెలిపారు.

# ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు







వరద బాధితుల సహాయార్థం పలువురు ప్రముఖులు సాయం అందజేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి ప్రముఖ నటుడు చిరంజీవి రూ. 50 లక్షలు విరాళం ఇచ్చారు. రామ్ చరణ్ తరపున మరో రూ. 50లక్షలు అందజేశారు. ఈమేరకు సీఎం రేవంత్‌ను కలిసి చెక్కులను ఇచ్చారు. అమర్ రాజా గ్రూప్ తరపున సీఎం సహాయనిధికి మాజీమంత్రి గల్లా అరుణ కుమారి రూ.కోటి విరాళం, సినీ నటులు అలీ రూ.3 లక్షలు, విశ్వక్ సేన్ రూ.10లక్షలు అందజేశారు. సినీ నటుడు సాయిధరమ్ తేజ్ రూ.10 లక్షలు, గరుడపల్లి ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ సంజయ్ గరుడపల్లి రూ.25 లక్షలు సీఎం సహాయనిధికి విరాళంగా ఇచ్చారు.

# ఈ అభిమానం ఇలాగే ఉండాలి

విజయ్ 'గోట్' సినిమాలో ఓ ప్రత్యేక పాత్రలో కనిపించింది మీనాక్షి చౌదరి. సినిమా ఫలితం ఎలా వున్నా ఈ ముద్దుగుమ్మ అందచందాలకు మాత్రం మంచి మార్కులే పడ్డాయి. మెకానిక్ రాకీ, విశ్వంభర, లక్కీభాస్కర్, మట్కా.. ప్రస్తుతం మీనాక్షి చేతిలో ఉన్న సినిమాల లిస్ట్ ఇది. తెలుగులోనే కాక, ఇతర భాషల్లోనూ నిదానంగా బిజీ అవుతున్నది మీనాక్షి చౌదరి. ఓ పక్క సినిమాలతో బిజీగా ఉంటూ మరో పక్క తన ఇన్స్టాగ్రామ్‌లో కొత్తకొత్త పోజులతో ఫొటోలను పోస్ట్ చేస్తూ, యువతకు కనులవిందు చేస్తున్నది ఈ హర్యానా అందాలభామ. రీసెంట్‌గా వైట్ అవుట్‌ఫిట్‌తో ఉన్న ఫొటోలను తన ఇన్‌స్టాలో షేర్ చేసింది. ఈ ఫొటోల్లో సింపుల్‌గా కనిపించినా, ఆమె లుక్ దెబ్బకు అందరూ మంత్రముగ్ధులవుతున్నారు. అందుకు తగ్గట్టుగానే కామెంట్లు వస్తున్నాయి. దీనిపై మీనాక్షి స్పందిస్తూ 'అందంగా కనిపించడంలో నేనెంత నిజాయితీగా ఉంటానో.. ఆ అందాన్ని అభినందించడంలో నా అభిమానులు కూడా అంతే నిజాయితీగా ఉంటారు. ఈ అభిమానం ఇలాగే ఉండాలని ఆశిస్తున్నా' అని ఇన్‌స్టాలో షేర్ చేసింది మీనాక్షీ చౌదరి.



# ఆ బాధ అందరికీ ఉంది



అమితాబచ్చన్, తాప్సీ ప్రధాన పాత్రలు పోషించిన బాలీవుడ్ సెన్సేషన్ 'పింక్' సినిమా విడుదలై సెప్టెంబర్ 16కి సరిగ్గా ఎనిమిదేండ్లు. ఈ సందర్భంగా నాటి సంగతులను నటి తాప్సీ గుర్తు చేసుకున్నది. 'భారతీయ సినీ చరిత్రలోనే గొప్ప సినిమాల్లో 'పింక్' ఒకటిగా నిలుస్తుంది. ఆ సినిమా చేస్తున్నప్పుడు ఆ స్థాయిని మేం ఊహించలేదు. అలాంటి గొప్ప సినిమాలో భాగమైనందుకు ఇప్పటికీ గర్వంగా ఫీలవుతా. అయితే.. ఏ సమస్యను ప్రశ్నిస్తూ ఎనిమిదేండ్ల క్రితం ఆ సినిమా చేశామో.. ఆ సమస్య ఇప్పటికీ అలాగే ఉంది. ఇంకా మాట్లాడితే ఇంకా జటిలమైంది. స్త్రీలకు సమాజంలో ఏమాత్రం రక్షణ లేకుండా పోయింది. ఈ సినిమాలో నటించిన అందరికీ ఆ బాధ ఉంది.' అంటూ చెప్పుకొచ్చింది. 2016లో విడుదలైన 'పింక్' సినిమా భారీ వసూళ్లతో పాటు, ఎన్నో పురస్కారాలను కూడా చేజిక్కించుకున్నది. 'బెస్ట్ ఫిల్మ్ ఆన్ సోషల్ ఇష్యూస్' కేటగిరిలో జాతీయ పురస్కారాన్ని కూడా అందుకున్నది.

# మనిషి ఆకలి.. గొర్రె ఆత్మరక్షణ

సుహాస్ హీరోగా రూపొందిన చిత్రం 'గొర్రె పురాణం'. బాబీ దర్శకుడు. ప్రవీణ్‌రెడ్డి నిర్మాత. ఈ నెల 20న ఈ చిత్రం విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా ట్రైలర్‌ని సోమవారం మేకర్స్ విడుదల చేశారు. 'నాపేరు రామ్.. అలియాస్ యేసు. గొర్రె జైల్లో వుండటం ఏందీ.. ఆడికెళ్లి తప్పించుకోవడం ఏందీ?.. ఇదంతా మీకు వింతగా వుందికదా..' అనే వాయిస్ ఓవర్తో ట్రైలర్ మొదలైంది. ఒక గొర్రె గ్రామంలోని రెండు మతాలమధ్య చిచ్చుపెట్టిన నేపథ్యాన్ని ట్రైలర్‌లో ఆవిష్కరించారు. గొర్రె వల్ల జరిగిన పరిణామాలు సినిమాలో ఆసక్తికరంగా ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. ట్రైలర్‌లో సుహాస్ ఖైదీగా కనిపించారు. 'మనం బతకటం కోసం వాటిని చంపేయొచ్చు.. మనది ఆకలి. మరి అవి బతకడం కోసం మనల్ని చంపేస్తే.. అది ఆత్మ రక్షణే కదా..' అని సుహాస్ చెప్పిన డైలాగ్ ఆలోచన రేకెత్తించేలా ఉంది. పోసాని కృష్ణమురళి, రఘు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సురేష్ సారంగం, సంగీతం: పవన్ సీహెచ్.

# మన బంధం శాశ్వతం



సినీ తారలు సిద్ధార్థ్, అదితిరావు హైదరీ వివాహబంధంలోకి అడుగుపెట్టారు. వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలోని రంగనాథస్వామి ఆలయంలో సోమవారం ఈ జంట వివాహం నిరాడంబరంగా జరిగింది. ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలు, సన్నిహితుల సమక్షంలో సిద్ధార్థ్, అదితిరావు హైదరీ పెళ్లిపీటలెక్కారు. పెళ్లికి సంబంధించిన ఫొటోలను అదితిరావు హైదరీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకుంది. 'నువ్వే నా సూర్యుడివి, చంద్రుడివి.. నువ్వే నా తారాలోకం.. మన ప్రేమబంధం శాశ్వతంగా నిలిచిపోయి నవ్యకాంతుల్ని వర్షిస్తుంది. మిసెస్ అండ్ మిస్టర్ అదు–సిద్ధు' అంటూ ఫొటోలకు క్యాప్షన్‌ను జతచేసింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. పలువురు సినీ తారలతో పాటు అభిమానులు నూతన జంటకు శుభాకాంక్షలందజేశారు. ఈ ఏడాది మార్చిలో సిద్ధార్థ్, అదితిరావు హైదరీ నిశ్చితార్థం జరుపుకున్నారు. 'మహా సముద్రం' సినిమా షూటింగ్ సమయంలో వీరిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం క్రమంగా ప్రేమగా మారింది. అదితిరావు హైదరీ తల్లిదండ్రులిద్దరూ రాజకుటుంబాలకు చెందిన వారు. అదితిరావు తల్లి విద్యారావు వనపర్తి సంస్థానానికి చెందిన జానంపల్లి రామేశ్వరరావు కుమార్తె. దాంతో వనపర్తి సంస్థానానికి వారసురాలిగా అదితిరావుకు గుర్తింపు ఉంది. అలాగే వనపర్తి జిల్లా రంగనాథ స్వామి ఆలయంతో అదితిరావు కుటుంబానికి ఎంతో అనుబంధం ఉంది. తమ కుటుంబంలో ఎలాంటి శుభకార్యాన్నైనా ఆ ఆలయంలోనే నిర్వహిస్తామని అదితిరావు హైదరీ పలు సందర్భాల్లో చెప్పింది. తన కుటుంబ మూలాలు, వారసత్వాన్ని గౌరవిస్తూ వివాహాన్ని కూడా అదే ఆలయంలో జరుపుకుంది.

Printed and Published by **VUPPARI RAMESH KUMAR** on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, **EDITOR: VUPPARI RAMESH KUMAR**. **RNI Reg No.TELTEL/2016/72952**.